ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

శుక్రవారం 20 జూన్ 2025 | 3

మావోయిస్టుల మృతదేహాలకు అర్ధరాత్రి పోస్టుమార్టం పూర్తి

బంధువులకు అప్పగింత

ఉదయం నుంచి రంపచోడవరంలో పడిగాపులు

ఎట్టకేలకు స్వస్థలాలకు మృతదేహాల తరలింపు

మెయిన్‌లో

వేగంగా.. వెళ్లిపోతున్నారు!

ప్రమాదం ఏ రూపంలో.. ఎటు నుంచి వస్తుందో తెలియడం లేదు.. గమనించేలోపే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.. కుటుంబీకులకు తీరని శోకం మిగులుస్తున్నాయి.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. నలుగురిదీ ఒకే ఊరు.. అందుకే మంచి స్నేహితులు. పిఠాపురం మండలం మల్లాంలో జరిగిన ఒక ఫంక్షన్‌కి గురువారం ఉదయం ఇంటి నుంచి ఆటోపై వెళ్లారు. అక్కడ ఆనందంగా గడిపారు. అనంతరం తిరిగి ఇళ్లకు బయలుదేరారు. మార్గమధ్యంలో ఆటోను వేగంగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది.. అంతే ఒక్కసారిగా వ్యాన్‌లో ఉన్నవారంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డారు. వీరిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

5



బిల్లు.. వేగంగా చెల్లు!

ప్రభుత్వం మారింది.. అన్నీ మారుతున్నాయి.. స్పష్టమైన మార్పు కనిపిస్తుంది.. గత వైసీపీ ప్రభుత్వంలో ఏదైనా అభివృద్ధి పనిచేయాలంటే కాంట్రాక్టర్లు వణికిపోయేవారు.. ఆ వైపునకే వచ్చే వారు కాదు.. ఎందుకంటే నిధుల విడుదల అంత దారుణంగా ఉండేది.. కూటమి ప్రభుత్వం వచ్చింది.. తీరు మారింది..పని నాణ్యత చూస్తున్నారు.. బిల్లులు విడుదల చేస్తున్నారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.25 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో కాంట్రాక్టర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి జైకొడుతున్నారు.

4



బడితెగింపు!



విద్యాహక్కు చట్టానికి తూట్లు

విద్యా హక్కుచట్టం అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లల్లో ఈ చట్టం కచ్చితంగా అమలు చేయాల్సి ఉండగా.. కొంతమంది ఆ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. స్కూళ్లు తెరిచి సుమారు పది రోజులు కావొస్తున్నా.. ఈ చట్టం ద్వారా ఎంతమంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారనే విషయంపై స్పష్టత లేదు. ఈ విషయం కోర్టులో ఉందని జిల్లా సర్వశిక్ష అభియాన్ అధికారులు చెబుతున్నారు.

గతేడాది ఒకటో తరగతిలో జాయిన్ చేసుకున్న ఓ ప్రముఖ కిడ్స్ పాఠశాల.. ఈ ఏడాది మాత్రం ఏకంగా తమ స్కూల్‌లో ఒకట్రెండు తరగతులు నిలిపివేశామని సెలవిచ్చింది. దీనిని సంబంధిత మండల విద్యాధికారి కూడా నిర్ధారించేశారు. దీనివల్ల ఆన్‌లైన్‌లో కేటాయింపు జరిగిన 18 మంది పిల్లల అడ్మిషన్లు అయోమయంలో పడ్డాయి. కొద్దిరోజుల్లోనే మళ్లీ ఆ పిల్లలను చేర్పించుకోవడం గమనార్హం. ఈ ఒక్క ఉదాహరణ చాలు పేదల సీట్లు ఎగ్గొట్టడానికి యాజమాన్యాలు ఎలాంటి ఎత్తులు వేస్తున్నాయో చెబుతుంది.

- సుప్రీం చెప్పినా పేదలకు పాట్లే
- ఆర్టీఈ ప్రవేశాలకు ముప్పుతిప్పలు
- పట్టని ప్రైవేటు యాజమాన్యాలు
- ఉమ్మడి జిల్లాలో సీట్లు 4,045
- పలు దరఖాస్తుల తిరస్కరణ
- మిగిలిన సీట్లు 1,268
- తల్లిదండ్రుల ఆవేదన
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ

(రాజమహేంద్రవరం/కాకినాడ/అమలాపురం - ఆంధ్రజ్యోతి)

విద్యాహక్కు చట్టాన్ని.. సుప్రీం కోర్టు నిర్దేశాలను పలు ప్రైవేటు/కార్పొరేటు పాఠశాలలు లెక్కచేయడం లేదు.ఎలాగైనా ప్రవేశం కల్పించాలనే ఉద్దేశం కొసరంత కూడా కానరావడం లేదు. ఏదోలా సీటు ఎగ్గొడదామనే దురుద్దేశం కొండంత కనిపిస్తోంది. తల్లిదండ్రులను ముప్పుతిప్పలు పెట్టి తూతూ మంత్రంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. చట్టాన్ని కొన్ని పాఠశాలలు ప్రతి ఏడాదీ పెద్దగా పట్టించుకోకపోయినా 'యాక్షన్' ఉండడం లేదు. విద్యార్థుల నుంచి ఏదో ఒక రూపేణా సొమ్ములు లాగేస్తున్నా కళ్లప్పగించి చూస్తున్నారు. దీంతో పేద తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎగ్గొట్టడానికి ఎత్తులు

విద్యాహక్కు చట్ట ప్రకారం పేదలకు సీట్లు కల్పించడానికి ప్రతి ఏడాదీ వెబ్‌సైటులో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఈ ఏడాది మే 27 నుంచి జూన్ 9 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అడ్మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారు. రెండో దశ, మూడో దశ కూడా దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. ఆరు దశల వడపోత తర్వాత పాఠశాలను కేటాయిస్తారు. ఇలా కేటాయించిన తర్వాత సదరు స్కూల్‌కి విద్యార్థిని తీసుకొని తల్లిదండ్రులు వెళ్లి సీటు నిర్ధారణ చేసుకోవాలి. ఈ దశలోనే విద్యార్థుల తల్లిదండ్రులకు నరకం చూపిస్తున్నారు. కాస్త గట్టిగా నిలదీస్తే పని జరుగుతోంది. లేదంటే అంతే. ఆర్టీఈ ప్రకారం అడ్మిషన్లను సమగ్ర శిక్షా (ఎస్‌ఏ/ఎస్ఎస్ఏ) చూసుకుంటోంది. సదరు అధికారులను స్కూలు యాజమాన్యాలు బురిడీ కొట్టిస్తున్నాయి.

సుప్రీం ఆదేశాలు బేఖాతర్..

విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కు చట్ట ప్రకారం ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా ప్రభుత్వమే ఆన్‌లైన్ ద్వారా సీట్లు కేటాయిస్తుంది. దీనిని ఉల్లంఘిస్తే సుప్రీం కోర్టు ఆదేశాలను లెక్కచేయనట్టే. దీనిపై తీవ్రమైన చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. స్కూల్ అనుమతులను రద్దు చేయడం జరుగుతుంది. అయితే పేదల సీట్ల విషయంలో అధికారులు ప్రైవేటు/ కార్పొరేటు స్కూళ్లను బతిమలాడుకోవాల్సి వస్తోంది. సుప్రీం కోర్టు ఆదేశాలున్నా కనీసం పట్టించుకోవడంలేదు. మాకేంటి అనేలా వారి తీరు ఉంది. పాఠశాలల యాజమాన్యాలు రకరకాల కారణాలు చూపుతూ విద్యాశాఖకు లేఖలు సమర్పించి సీట్లను ఎగ్గొట్టే పనిలో పడ్డాయి.

ఉచితమన్నా..భర్తీ కాని సీట్లు 1268

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1418, కాకినాడ జిల్లాలో 1812, కోనసీమ జిల్లాలో 815 సీట్లు ఉన్నాయి. మూడు జిల్లాల్లో కలిపి మొత్తంగా 4,045 సీట్లు కేటాయించారు. తల్లిదండ్రుల వేడుకోలు, అధికారుల బుజ్జగింతల అనంతరం తూర్పుగోదావరి జిల్లాలో 1380 మందికి, కాకినాడ జిల్లాలో 754 మంది, కోనసీమ జిల్లాలో 643 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. మొత్తంగా 1,268 సీట్లు భర్తీకాలేదు. ఉచితమన్నా భర్తీ కాకపోవడం గమనార్హం. దీనిపై అధికారులు ఆలోచించాలి.

వివరాలు గోప్యం?

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు తప్పనిసరిగా విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్లు ఇవ్వాలి. ఆర్టీఈ ద్వారా కొన్నేళ్లుగా ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ చేపడుతున్నా.. వాటి వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతోంది. ఏటా అడ్మిషన్ల సమయంలో హడావుడి చేసే విద్యాశాఖ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లాల వారీగా ఏయే పాఠశాలలో ఎన్ని అడ్మిషన్లు కల్పించారనే వివరాలను మాత్రం వెల్లడించడం లేదు. ఇప్పటి వరకు ఆర్టీఈ ద్వారా కల్పించిన వివరాలు కూడా విద్యాశాఖ బయటపెట్టలేదు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఒత్తిడితోనే వివరాలు బయటపెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఉచితమని.. లాగేస్తున్నారు?

చట్ట ప్రకారం ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తే పదో తరగతి వరకూ ఆ వెసులుబాటు ఉంటుంది. ఇవాళ ప్రైవేటు/ కార్పొరేటు పాఠశాలల్లో చూస్తే ఒకటో తరగతికి రూ.లక్ష లాగేస్తున్నారు. వాస్తవంగా లెక్కలు వేస్తే పాక్షిక ఉచితమనే విషయం బోధపడుతుంది. బస్సు, పుస్తకాలు, యూనిఫాం, షూ, టై, బెల్టు, బిల్డింగ్ ఫండ్, స్పెషల్ ఫీజు, ఐఐటీ, నీట్ ఇలా రకరకాల బాదుడు మామూలే. ఈ డబ్బులు ఆయా తల్లిదండ్రులు చెల్లించాల్సిందే. కేవలం ట్యూషన్ ఫీజులో మాత్రమే ఉచితం కాదుగానీ రాయితీ ఇస్తున్నారు. అయినప్పటికీ ఆర్టీఈ ప్రకారం అడ్మిషన్లు అనగానే యాజమాన్యాలు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. కఠిన చర్యలు తీసుకొనే అవకాశం విద్యాశాఖ అధికారులకు ఉన్నా ఆ అధికారాన్ని కాగితంపై పెట్టకపోవడంపై ఆరోపణలు వినవస్తున్నాయి.



పేదింటికి.. నిధులు!

గృహం వీడిన.. వైసీపీ గ్రహణం

- టిడ్కో ఇళ్లకు ఇన్నేళ్లకు మోక్షం
- ఉమ్మడి జిల్లాలో 26 వేల ఇళ్లు
- గత ప్రభుత్వంలో పట్టని తీరు
- వసతులకు కూటమి పచ్చజెండా
- నిధులకు ప్రభుత్వ ఆదేశాలు
- రూ.103 కోట్ల విడుదలకు జీవో
- కొంతైనా పనుల్లో కదలికకు చాన్స్
- టిడ్కో లబ్ధిదారుల్లో ఆనందం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

టిడ్కో ఇళ్లకు ఎట్టకేలకు గ్రహణం వీడింది. గత వైసీపీ ప్రభుత్వ అరాచక నిర్ణయంతో వేలాది మంది లబ్ధిదారుల ఐదేళ్ల కన్నీటి వేదనకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఫేజ్1, ఫేజ్2 ఇళ్లకు సంబంధించి మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2019కు ముందు టీడీపీ ప్రభుత్వం 23,400 ఇళ్లను పట్టణ పేదల కోసం ఏపీ టిడ్కో పేరుతో నిర్మించింది. ఇందులో రెండో దశ ఇళ్లు 2,600కాగా దాదాపు ఇవి పూర్తయ్యే సమయానికి వైసీపీ అధికారంలోకి రావడంతో గ్రహణం పట్టుకుంది. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయిస్తే టీడీపీ ప్రభుత్వానికి మంచి పేరొస్తుందన్న భయంతో ఐదేళ్లు కక్షపూరితంగా వ్యవహరించింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో గ్రహణం వీడింది. ఉమ్మడి జిల్లాలో రెండు దశల ఇళ్ల మరమ్మతులకు రూ.106 కోట్ల అవసరం ఉందని తాజాగా గుర్తించారు.

పేదలపై గత ఐదేళ్లూ కక్ష..

పట్టణ పేదల్లో ఎంతో మంది సొంతిళ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం 2016లో టిడ్కో (టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. వేగంగా షేర్‌వాల్ టెక్నాలజీ విధానంలో వీటిని నిర్మించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొదటి, రెండు దశల్లో 23,400 ఇళ్లను నిర్మించాలని లక్ష్యం విధించుకుంది. కాకినాడ జిల్లాలో 7,288 ఇళ్లు, కోనసీమ జిల్లాలో 9,808, తూర్పుగోదావరి జిల్లాలో 6,304 ఇళ్ల చొప్పున కట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసి రంగంలోకి దిగింది. ఇందులో తొలిదశ కింద 20,800 ఇళ్లను 2018 నాటికి పూర్తిచేసింది. నిర్మించిన అపార్ట్‌మెంట్లలో 300 ఎస్ఎఫ్‌టీ ఉన్న ఇళ్లను పేదలకు ఉచితంగా, 430 ఎస్ఎఫ్‌టీ డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ.3.65 లక్షల రుణం, రూ.లక్ష వాటాదారుడు చెల్లించాలని నిర్ణయించారు. అర్హులైన లబ్ధిదారులకు లాటరీ విధానంలో ఇళ్లను కేటాయించారు. ఆ తర్వాత రెండో దశ కింద ఉమ్మడి జిల్లాలో 2,600 ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టింది. ఇవి దాదాపు పూర్తయ్యే సమయానికి ప్రభుత్వం మారి వైసీపీ వచ్చింది. అయితే అప్పటి సీఎం జగన్ వచ్చీరాగానే టిడ్కో ఇళ్లపై కక్ష తీర్చుకున్నారు.ఐదేళ్ల పాటు పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో గత ఐదేళ్లూ భవనాలు పాడైపోయాయి. పేదలకు వీటిని ఇవ్వాలంటూ అప్పట్లో లబ్ధిదారులు, నాటి ప్రతిపక్ష టీడీపీ ఎన్నిసార్లు పోరాటాలు చేసినా కనీసం ఖాతరు చేయలేదు. బ్యాంకు రుణాలు తెచ్చిన లబ్ధిదారులు వాయిదాలు చెల్లించలేక యాతన పడ్డారు.

ఇన్నేళ్లకు మంచిరోజులు..

ఏడాది కిందట ప్రభుత్వం మారడంతో మళ్లీ టిడ్కో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.ఎట్టకేలకు ప్రభుత్వం లబ్ధిదారులకు తీపికబురు అందించింది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్ నుంచి రూ.103 కోట్ల అదనపు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాది టిడ్కో ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు మార్గం సుగమమైంది. కాకినాడ నగరంలోని పర్లోవపేటలో రెండో దశ కింద నిర్మించిన 904 టిడ్కో ఇళ్లు ఐదేళ్ల కిందట పూర్తయిపోయాయి. కానీ జగన్ ప్రభుత్వం వీటిని ఐదేళ్లు గాలికొదిలేసింది. ఇప్పుడు రూ.55 కోట్లు ఉంటే అన్నీ పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వడమే మిగిలి ఉంది.కోనసీమ జిల్లాలో అమలాపురం, మండపేట, రామచంద్రపురం పట్టణాల్లో టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులకు రూ.31 కోట్లు అవసరం. తూర్పుగోదావరి జిల్లా నామవరంలో రెండో దశ కింద నిర్మించిన 1,104 ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. జిల్లాలో ఏడు ప్రాజెక్టుల కింద 6,304 ఇళ్లకు ఇప్పటికే 5,574 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. మౌలిక సదుపాయాల్లేక చాలా తక్కువ మంది మాత్రమే గృహప్రవేశాలు చేశారు. చాలా ఇళ్లు పూర్తికాలేదు. నిడదవోలులో 1,755 ఇళ్లకు 1,248 మొదలుపెట్టారు. బొమ్మూరులో నిర్మించిన 2,528 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించగా 1,977 మంది మాత్రమే తాళాలు తీసుకున్నారు. ఇక్కడ రెండో దశలో నిర్మించిన 2 వేల ఇళ్లను ఇంకా అప్పగించలేదు. వీటిలో మౌలిక వసతుల కల్పనకు రూ.20 కోట్లు కావాల్సి ఉంటే జగన్ ప్రభుత్వం నిలిపివేసింది. ప్రభుత్వం నిధుల మంజూరుకు పచ్చ జెండా ఊపడంతో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల బాధలు తప్పినట్లయింది.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి!



సీఎం వీడియో కాన్ఫరెన్సుల్లో కలెక్టర్లకు సూచన

అమలాపురం, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈనెల 21న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్‌లను ఆదేశించారు. సీఎం, ముఖ్య కార్యదర్శులతో కలిసి అమరావతి నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నద్ధతతపై జిల్లాల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నమోదు చేసిన వేదికల్లో కనీసం ఒక్కొక్క వేదికలో 200 మంది తక్కువ కాకుండా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, కామన్ యోగా ప్రొటోకాల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు. ఆన్‌లైన్ సర్టిఫికేషన్ జారీ, ప్రజలు, విద్యార్థుల నమోదు ప్రక్రియ పూర్తిచేసినట్టు తెలిపారు. వేదికల వద్ద ఇన్‌చార్జిలు, సూపర్‌వైజర్లను నియమించాలని జిల్లాస్థాయిలో స్థానిక కిమ్స్ వైద్య కళాశాల వద్ద 5వేల మందితో కామన్ యోగా ప్రొటోకాల్ యోగాసనాలు చేయించాలన్నారు. ఈ ప్రక్రియను వీడియో చిత్రీకరించి వేదికల వద్దనున్న ఇన్‌చార్జిలకు అందజేయాలని ఆయన సూచించారు. ఈ వీసీలో జాయింట్ కలెక్టర్ నిషాంతితోపాటు డ్వామా పీడీ మధుసూదన్, డీఎల్‌డీవో రాజేశ్వరరావు, డీఈవో షేక్ సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సానుకూల రాజకీయ వాతావరణం


టీడీపీ మైనార్టీ ఎఫైర్స్ సలహాదారుడు ఎండీ షరీఫ్

5

రైలు కల.. ముందుకు

- కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణ ప్రగతిలో కదలికలు
- మూడు నదులపై సూపర్ స్ట్రక్చర్ల ఏర్పాటుకు టెండర్లు ఖరారు
- భట్నవిల్లి నుంచి బోడసకుర్రు వరకు భూసేకరణకు జాయింట్ సర్వే
- నేడు శానపల్లిలంకలో రైల్వే పనుల ప్రారంభానికి ఎంపీ శ్రీకారం





గౌతమి నదిపై కోటిపల్లి-శానపల్లిలంక మధ్య పూర్తయిన పియర్స్ నిర్మాణం, వైనతేయ నదిపై బోడసకుర్రు-పాశర్లపూడి మధ్య పూర్తయిన పియర్స్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కోనసీమవాసుల దశాబ్దాల కలను సాకారం చేసేందుకు కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాల కృషితో కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణానికి అడుగులు ముందుకు పడుతున్నాయి. గత రెండున్నర దశాబ్దాలకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ రైల్వే ప్రాజెక్టు పనులు కూటమి ప్రభుత్వాల ఐదేళ్ల పాలనలో పూర్తిచేసేలా ప్రజాప్రతినిధులు ప్రణాళికలను అమలుచేస్తున్నారు. మూడు గోదావరి నదీపాయలపై నిర్మించిన వారధులపై సూపర్ స్ట్రక్చర్ నిర్మాణానికి టెండర్లు పూర్తిచేసి కాంట్రాక్టు సంస్థలకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది. కీలకంగా మారిన భూసేకరణ రైల్వే, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ తన పదవీకాలంలో ఈ ప్రాజెక్టును పూర్తిచేసి తన తండ్రి, దివంగత నేత జీఎంసీ బాలయోగి ఆశయ సాధనలో భాగస్వామ్యం అవుతానని చెబుతున్నారు. అయినవిల్లి మండలం శానపల్లిలంక వద్ద శుక్రవారం రైల్వేలైన్ నిర్మాణ పనులను పునః ప్రారంభానికి ఎంపీ గంటి హరీష్‌మాధుర్ శ్రీకారం చుట్టనున్నారు.

సూపర్ స్ట్రక్చర్ల నిర్మాణానికి టెండర్ల పూర్తి

కోటిపల్లి-నర్సాపురం రైల్వే నిర్మాణ పనులు గత రెండున్నర దశాబ్దాల నుంచి ఆశించిన మేర పురోగతిలో లేవు. గౌతమీ, వశిష్ఠ, వైనతేయ నదీ పాయలపై ఇప్పటికే రైల్వే వంతెనలకు సంబంధించి పియర్స్ నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చాయి. ఒకట్రెండు ప్రాంతాల్లో అబెట్‌మెంట్ వాల్స్ నిర్మాణాలు చేస్తున్నారు. అయితే ఈ నదులపై పియర్స్ పూర్తి అయినందున సూపర్ స్ట్రక్చర్ నిర్మాణానికి రైల్వేశాఖ టెండర్లు పిలిచింది. కాంట్రాక్టు అవార్డు ఖరారు అవుతుంది. ఇది ఖరారు అయితే వారధులపై గడ్డర్లు, రైల్వేట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభమై రెండేళ్ల కాలపరిమితిలోనే పూర్తవుతాయని అంచనా. ఈ రెండేళ్లకాలంలో సూపర్ స్ట్రక్చర్ నిర్మాణాలు జరుగుతుండగానే ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, ట్రాక్ నిర్మాణాలు జరిగేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఎంపీ గంటి హరీష్‌బాలయోగి రైల్వేలైన్ పురోగతిపై తన మనోగతాన్ని వెల్లడించారు. అయితే ప్రస్తుతం శానపల్లిలంక నుంచి భట్నవిల్లి వరకు 2003లో భూసేకరణ పూర్తి అయింది. అప్పట్లో నిర్వాసితులకు పరిహారాన్ని రైల్వేశాఖ చెల్లించింది. ఇప్పటి వరకు ఆ భూములను స్వాధీనం చేసుకోకపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఆ భూములు అప్పచెప్పాలంటే పరిహారం పెంచి ఇవ్వాలనే డిమాండ్‌తో శానపల్లిలంక నుంచి భట్నవిల్లి వరకు ఉన్న రైల్వేలైన్ భూ బాధితులు ఇటీవల ఎంపీ హరీష్‌మాధుర్‌తో పాటు రైల్వేశాఖ అధికారులతో కలిసి మహిపాలచెరువులోని కన్వెన్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. వారి న్యాయసమ్మతమైన డిమాండ్‌ను తీర్చేలా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిసి వివరించడం జరిగిందని, త్వరలో వారి పరిహారం పెంచుతారనే ఆశాభావాన్ని ఎంపీ వ్యక్తంచేశారు.

జాయింట్ సర్వే ద్వారా రైల్వేలైన్ నిర్ధారణ

అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి నుంచి బోడసకుర్రు వంతెన వరకు రైల్వేలైన్ భూసేకరణ క్లిష్టతరంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాస్థాయి అధికారులు అప్పటి పాలకుల ఒత్తిడికి లోబడి గతంలో నిర్ణయించిన ఎలైన్‌మెంట్ మార్చి రెండో ఎలైన్‌మెంట్ ప్లాన్ చేశారు. ఇప్పుడు భట్నవిల్లి నుంచి బోడసకుర్రు వరకు భూసేకరణ చేపట్టడం క్లిష్టతరంగా మారింది. ఈనేపథ్యంలో రెవెన్యూ, రైల్వేశాఖల జాయింట్ సర్వే చేపట్టి వారి నిర్ణయం మేరకు పాత ఎలైన్‌మెంటా, కొత్త ఎలైన్‌మెంటా అనేది నిర్ధారణ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టనున్నారు. అలాగే పాశర్లపూడి నుంచి దిండి వరకు భూసేకరణకు ఏ ఆటంకాలు లేవని, అది త్వరితగతినే పూర్తి అవుతుందనేది కూటమిలోని ప్రజాప్రతినిధుల అభిప్రాయంగా ఉంది.



ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్షిస్తున్న హరీష్

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఎంపీ హరీష్ భేటీ

పొలాల్లో ఉప్పునీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ

అమలాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. అమలాపురంలోని తన నివాస గృహంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో గురువారం ఎంపీ హరీష్‌మాధుర్ సమీక్ష నిర్వహించారు. జలజీవన్ మిషన్ పనులు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ సీహెచ్ కృష్ణారెడ్డి, ముమ్మిడివరం డీఈఈ టీవీ రామ్‌ప్రసాద్, మండపేట డీఈఈ ఏజీ రామారావు, అమలాపురం డీఈఈ పార్థసారథి, రాజోలు డీఈఈ రాజన్ పాల్గొన్నారు. కాగా ఎన్నో ఏళ్లుగా పంట పొలాల్లోకి ఉప్పునీరు చొచ్చుకు వచ్చి భూములు చౌడు బారుతున్నాయని ఉప్పలగుప్తం మండలానికి చెందిన రైతులు గురువారం ఎంపీ హరీష్‌ను కలిసి తమ గోడు వ్యక్తం చేశారు. త్వరలో ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హరీష్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష

జిల్లాలోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ గురువారం సమీక్షించారు. నీటికాలుష్యం వల్ల సంక్రమించే అతిసార వ్యాధి నివారణ చర్యల్లో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కీలక పాత్ర వహించాలని సూచించారు. ఈ సమీక్షలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.రామకృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ కార్తీక్, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌ల పథకంపై సర్వే'

అమలాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీలకు సంబంధించి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకోసం ఎంపీడీవోలు, ట్రాన్స్‌కో అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ప్రాధాన్యతా క్రమంలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. మొదటి దశలో ఉచితంగా అందించే వీటికోసం ప్రాధాన్యతా క్రమంలో సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిందిగా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఎల్‌డీవోలు, ఎంపీడీవోలు, ట్రాన్స్‌కో అధికారులతో పీఎం సూర్యఘర్ యోజన పథకం అమలుకు ఎస్సీ ఎస్టీ గృహాల సర్వే పురోగతిపై సమీక్షించారు. ఈనెల 25వ తేదీ నాటికి సమగ్ర సర్వే పూర్తిచేసి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు.



కాకినాడలో యోగాంధ్ర కార్యక్రమంలో యోగాభ్యాసన చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

ఊరూరా ఒకటే నినాదం యోగాంధ్ర. ఆరోగ్యవంతమైన జీవనానికి దారి చూపే దివ్యౌషధం యోగా. ప్రాచీనమైన ఈ విద్యను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ ఏడాది విశాఖలో నిర్వహించే ఈ దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నెలరోజులపాటు కూటమి ప్రభుత్వం యోగాంధ్ర పేరిట అవగాహన, శిక్షణా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తూ వస్తోంది. శనివారం నాడు జరిగే యోగా దినోత్సవంతో ఈ కార్యక్రమాలు ముగుస్తాయి. యోగా మన జీవితంలో ఒక భాగం కావాలని ఈ కార్యక్రమాల ఉద్దేశం. ఎన్నో విలువైన ఆరోగ్య ప్రయోజనాలున్న ఈ ప్రక్రియపై ప్రత్యేక కథనం..

యోగాతో.. ఒత్తిడిని జయించి, ఆరోగ్యంగా ఉందాం!

నేటితో ముగుస్తున్న యోగాంధ్ర అవగాహన శిక్షణ, కార్యక్రమాలు

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం.. ఉమ్మడి జిల్లాల్లోనూ విస్తృత కార్యక్రమాలు

(ఆంధ్రజ్యోతి - కాకినాడ కార్పొరేషన్)

ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో దైనందిక జీవితం ఒత్తిళ్లమయం. వేగభరితమైన సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదొక సమయంలో తీవ్ర ఒత్తిడికి గురతున్నవారే. ఈ విషయంలో ఏ ఒక్కరికీ మినహాయింపు లేదు. చదువు, వృత్తి, ఉద్యోగాల విషయాల్లో రోజురోజుకి పెరిగిపోతున్న పోటీ, సమయాభావం, నిద్రలేమి, ఉరుకు పరుగుల జీవనంతో యువత సతమతమవుతోంది. ఇవన్నీ శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండాల్సిన వయస్సులో నీరసం, నిస్సత్తువ ఆవహిస్తూ ఉండడంతో తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. ఒత్తిడిని ఎదుర్కొంటూ ఈ పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలంటే కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యాయామం వంటివి చేయాలంటున్నారు. మన ఆహార విషయాల్లో సైతం జాగ్రత్తలు పాటించాలని అప్పుడే శక్తిని, నూతనోత్తేజం పొందుతారని చెబుతున్నారు.

యోగాకి పెరిగిన ఆదరణ

యోగా.. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలకపాత్ర పోషించే ఆయుధం. దీనివల్లే వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాపై మక్కువ చూపుతున్నారు. దీనికోసం కొంత సమయాన్నీ కేటాయిస్తున్నారు. ఫలితంగా యోగా కేంద్రాలు, శిక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది. రోగాలను రూపుమాపే అద్భుతమైన శక్తి యోగాకు ఉందని ప్రపంచవ్యాప్తంగా నమ్ముతున్నారు. దీర్ఘకాలిక రోగాలు తగ్గుతున్నాయన్న ప్రచారం కూడా ఉంది. ఆధునిక సమాజంలో ఈ ప్రాచీనమైన యోగా ప్రక్రియకు అందుకే ప్రాధాన్యం పెరుగుతూ వస్తోంది. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన యోగా పల్లెలనూ పలకరిస్తోంది. యోగాతో ఆరోగ్యం, ఒత్తిడిని జయించే అవకాశం ఉన్నప్పుడు ప్రస్తుత జీవనంలో ఇంతకంటే మెరుగైనది మరొకటి లేదనే చెప్పాలి మరి.

ముగిసిన యోగాంధ్ర విస్తృత ప్రచారం

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెలరోజులపాటు యోగాంధ్ర పేరుతో రాష్ట్రంలో విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించి, ఈమేరకు మే 19న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో రెండు కోట్ల మందిని భాగస్వాములను చేయాలని కలెక్టర్లకు సూచించారు. ముగింపు వేడుకగా జూన్ 21న విశాఖలోని ఆర్కే బీచ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నారు. దీంతో నెలరోజులపాటు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధతో ఈ అవగాహన, శిక్షణ కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించారు. సోమవారం విశాఖలో జరిగే కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అధిక సంఖ్యలో యోగాభ్యాసకులు తరలివెళ్లడానికి సిద్ధపడుతున్నారు. అందుకుగాను ప్రభుత్వ యంత్రాంగం కూడా తగిన ఏర్పాట్లు చేస్తోంది.

పుస్తకాలతో కుస్తీ

ఉదయం పాఠశాల, కళాశాలలకు వెళ్లిన విద్యార్థులు ఏ రాత్రికో గానీ ఇళ్లకు చేరడంలేదు. పోటీ ప్రపంచంలో కాన్వెంట్ నుంచి కళాశాల చదువు వరకు ర్యాంకులమయంగా మారింది. దీంతో సంబంధిత యాజమాన్యాలు విద్యార్థులను పది నుంచి 12 గంటల వరకు తమ వద్దనే ఉంచుతున్నాయి. హాస్టళ్లలో ఉండే విద్యార్థుల పరిస్థితి మరీ దారుణం. వేకువజామున లేచి కాలకృత్యాలు తీర్చుకుని ఐదో గంటకు స్టడీ అవర్‌కు సిద్ధం కావాల్సిన పరిస్థితి. ప్రతి నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టాల్సి వస్తోంది. ఏడాదంతా చదివినా అనుకున్న ర్యాంక్ వస్తుందా.? రాదా? అనే టెన్షన్ విద్యార్థులను శారీరకంగా మానసికంగా కుంగదీస్తున్నది. మూడేళ్లు నిండని చిన్నారులకు సైతం పుస్తకాల బ్యాగు మోత. ఇంటా బయటా ఒకటే ఒత్తిడి. భర్త, పిల్లల సంక్షేమం, ఉన్నతి కోసం ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. గృహావసరాలు, పిల్లల అల్లరి వారి చదువు, హోం వర్కులు ఇలా నిత్యం అష్టావధానం చేయాల్సి వస్తోంది. పిల్లలు అనారోగ్యానికి గురైతే తీవ్ర ఒత్తిడికి గురవుతూ సేవలందించే పరిస్థితి గృహిణులది. ఉద్యోగం చేస్తున్న మహిళల సంగతి చెప్పనవసరంలేదు. ఇంటికి సంబంధించి అన్ని పనులు పూర్తి చేసుకుని ఆదరాబాదరాగా విధులకు సకాలంలో చేరాలి. ఆఫీసులో పని ఒత్తిడి, కొన్నిచోట్ల మానసిక వేధింపులు అయినా సరే సర్దుకుపోయే పరిస్థితి.

ఉద్యోగుల పరిస్థితీ అదే

నేటి ఉద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. జిల్లా కలెక్టర్ మొదలు దిగువస్థాయి ఉద్యోగి వరకు ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నారు. పని ఒత్తిడిలోనే కొంతమంది ఉద్యోగులు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన వారు కొందరైతే యంత్రాల్లా పనిచేస్తున్న గుర్తింపులేని పరిస్థితి మరికొందరిది. సాధారణ పౌరులు, కూలీలు కూడా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మానసిక ఒత్తిడి, శారీరక సమస్యలకు కొద్దిసేపు యోగాకు సమయం కేటాయించడం ద్వారా ఉపశమనం పొందే అవకాశం ఉంది.

మన రాష్ట్రంలో జరగడం గర్వకారణం



ప్రపంచ యోగా దినోత్సవం ప్రధాన వేడుక మన రాష్ట్రంలో జరుగుతుండడం, ప్రధాని మోదీ హాజరుకావడం మనకు గర్వకారణం. రెడ్‌క్రాస్ నుంచి ప్రతి నెలా 50 నుంచి 100 మందికి యోగా నేర్పిస్తున్నాం. 20 ఏళ్లగా యోగా కేంద్రం నిర్వహిస్తూ ఎంతోమందిని ప్రోత్సహిస్తున్నాం.

- వైడీ రామారావు, రెడ్‌క్రాస్ రాష్ట్ర, జిల్లా చైర్మన్, కాకినాడ

ప్రభుత్వ నిర్ణయం ప్రశంసనీయం



యోగా ప్రాధాన్యాన్ని తెలియజెప్పేందుకు యోగాంధ్ర పేరుతో నెలరోజులపాటు విస్తృత ప్రచారం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ప్రశంసనీయం. యోగాతో షుగర్, బీపీ, ఆస్తమా వంటి దీర్ఘకాలిక రోగాలు తగ్గుముఖం పడతాయి. ప్రాణాయామం వల్ల మనిషి శారీరక, మానసిక ప్రవర్తనలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. ఆలోచించే శక్తి, క్షమించే గుణం పెరుగుతుంది. దూకుడుతనం తగ్గి ప్రేమించే మనస్తత్వం పెరుగుతుంది. మహిళల్లో ఇంకా చైతన్యం రావాలి. వ్యాధులతో సతమతమవుతూ అవస్థలు పడుతున్న వారికి యోగా చక్కని ఉపశమనం కలిగిస్తుంది.

- యోగాచార్య చిట్టూరి చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు

పదేళ్ల నుంచి ఫ్రీ యోగా క్లాసులు..



సాలిపేట హిందూ స్పెషల్ ఎంసీపీఎస్ స్కూల్లో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తూనే పదేళ్లగా ఎంతో మందిని యోగ వైపు నడిపించాను. నరసన్ననగర్ యోగ సెంటర్లో ఉదయం సాయంత్రం 200మందికి యోగా క్లాసులు చెప్తుంటాను. యోగా సాధన వల్ల శ్వాసకోస సమస్యలు తగ్గడంతోపాటు శరీరాన్ని బలోపేతం చేస్తుంది. ఏకాగ్రతను పెంచడానికి విద్యార్థులు యోగ సాధన చాలా మందిది. - కె.పద్మజ, యోగా నిర్వాహకురాలు, కాకినాడ

యోగాలోనూ చెరిసగం





యోగాసనాలు వేస్తున్న భార్యాభర్తలు

యోగాలో రాణిస్తున్న భార్యాభర్తలు

మామిడికుదురు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లూటుకుర్రు గ్రామానికి చెందిన భార్యాభర్తలు వివిధ రకాల యోగాసనాలు వేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. లూటుకుర్రు ఉపసర్పంచ్ అయిన కోట బ్రహ్మానందం, హేమలత దంపతులు వివిధ రకాల యోగాసనాలు వేసి తాము నేర్చుకున్న విద్యను మరికొంత మందికి యోగా నేర్పుతూ అందిస్తున్నారు. తాము రెండున్నర సంవత్సరాలుగా మామిడికుదురులో యోగా గురుకేతన్ ఆకుల వద్ద యోగాలో మెలకువలు నేర్చుకున్నట్టు తెలిపారు. యోగాలో క్లిష్టమైన ఆసనాలు వేస్తూ మామిడికుదురులో పలువురికి స్వచ్ఛందంగా సేవా భావంతో యోగాలో తర్ఫీదు ఇస్తున్నారు. యోగాంధ్రలో వీరి ఆసనాలు ఆకట్టుకున్నాయి.



యోగా ఆన్‌లైన్..

విదేశాల వారికీ శిక్షణ ఇస్తున్న మండపేట యోగాగురువు శ్రీనివాస్

మండపేట, జూన్19(ఆంధ్రజ్యోతి) మండపేట పట్టణానికి చెందిన యోగా గురువు కేదారిశెట్టి శ్రీనివాస్ తాను నేర్చుకున్న యోగాను దేశవిదేశాల్లో ఉండే తెలుగువారికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తూ యోగా విశిష్టతను వివరిస్తున్నారు. ఈయనకు యోగాలో 30ఏళ్ల అనుభవం ఉంది. ఆయన బెంగళూరులో ఉన్న వివేకానంద యోగా యూనివర్సిటీలో యోగా డిగ్రీ పట్టా, హరిద్వార్‌లో పతంజలి యోగా కేంద్రంలో శిక్షణ పొందిన ధ్రువీకరణ పత్రాలను పొందారు. గత 30 ఏళ్ల నుంచి అమెరికా, యూకేతోపాటు దేశంలోని కర్ణాటక, తెలంగాణ, విజయవాడ, విశాఖలో వారికి కూడా ఆయన ఆన్‌లైన్ ద్వారా యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. అలాగే మండపేటలో ఆయన పాఠశాల విద్యార్థులకు యోగాలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. యోగా నేర్చుకునేవారికి ఆరునెలలపాటు శ్రీనివాస్ శిక్షణ ఇస్తున్నారు. ఆరేళ్ల వయస్సు నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ఆయన శిక్షణ ఇస్తున్నారు. యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆయన ఇలా అన్నారు.. మన దేశంలో పుట్టిన యోగా ఈరోజు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందడం ఆనందంగా ఉంది. యోగా ద్వారా మానసిక ప్రశాంతత, కీళ్లనొప్పులు వంటి దీర్ఘకాలిక సమస్యలు యోగా ద్వారా నయమవుతాయి. ప్రభుత్వం యోగాను పాఠ్యాంశంగా చేర్చి విద్యార్థి దశ నుంచే నేర్పించాల్సి అవసరం ఉంది.



గుంతలు పూడ్చడంతో ఆహ్లాదకరంగా ఉన్న కొత్తపల్లిలోని ఉప్పాడ బీచ్ రోడ్డు

బిల్లు.. నిధుల జల్లు!

- ఉమ్మడి జిల్లాలో రహదారుల గుంతలు పూడ్చిన పనులకు బిల్లులు చకచకా
- ఏళ్ల తరబడి జాప్యం లేకుండా దఫదఫాలుగా ప్రభుత్వం సత్వర చెల్లింపులు
- ఈనెలాఖరులోగా ఉమ్మడి జిల్లాకు రూ.25కోట్ల వరకు నిధులు జమ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రహదారులపై గుంతలు లేకుండా యుద్ధప్రాతిపదికన పనులు చేసిన ప్రభుత్వం బిల్లుల చెల్లింపులోను వేగం పెంచింది. బకాయిలకు ఏళ్ల తరబడి వేధించకుండా చకచకా బిల్లులు మంజూరు చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో బకాయిల కోసం ఎందరో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకోగా, ఇప్పుడు మాత్రం చేసిన పనులకు నాన్చకుండా బిల్లుల చెల్లింపులు జరుగుతోంది. త్వరలో ఉమ్మడి జిల్లాకు రూ.25కోట్ల వరకు ప్రభుత్వం నిధులు జమ చేయనుంది. తద్వారా గుంతల రహదారుల బిల్లులను చెల్లింపును దాదాపు పూర్తి చేయబోతోంది. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు రహదారుల బాగోగులను పూర్తిగా గాలికి వదిలేసింది. ప్రభుత్వం మారగానే సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆర్అండ్‌బీ అధికారులు వీటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశారు. ఇందుకు ప్రభుత్వం రూ.89కోట్ల వరకు ఖర్చుచేసింది.

గుంతలు పూడ్చి.. క్షేమకరంగా మార్చి..

ఉదయం నిద్రలేచింది మొదలు జనం రకరకాల పనులపై రోడ్లపైకి వస్తారు. ఇవి సాఫీగా ఉంటేనే ప్రయాణం సాగుతుంది.కానీ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వీటిని గాలికి వదిలేసింది. రోడ్లపై ఎక్కడ చూసినా భారీ గుంతలతో ప్రయాణం చేయలేక జనం నరకయాతన పడినా కనీసం పట్టించుకోలేదు. వర్షాలు, వరదలు, తుపానులకు ఎక్కడికక్కడ రోడ్లన్నీ పాడైపోయినా కనీసం మరమ్మతులు చేయలేదు. దీంతో ఈ గుంతలపైనే జనం ఐదేళ్లు నానా బాధలు పడుతూ రాకపోకలు సాగించారు. కొందరైతే ఈ గుంతల్లో పడి చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. గుంతల రోడ్లపై ప్రయాణించడంతో అనేక బైక్‌లు, కార్లు, లారీలు సైతం మరమ్మతులకు గురయ్యాయి. ప్రధానంగా కాకినాడ నుంచి రాజమహేంద్రవరం సామర్లకోట రోడ్డుపై ప్రయాణిస్తే వాహనాలు పాడైపోతాయన్న భయంతో కొంత కాలం ప్రైవేటు కారు ట్రావెల్స్ బుకింగ్‌లు రద్దు చేసుకున్నాయంటే ఏస్థాయిలో జనాన్ని గత వైసీపీ ప్రభుత్వం పీడించేసిందో అర్థం చేసుకోవచ్చు. గతేడాది ప్రభుత్వం మారగానే ఉమ్మడి జిల్లాలో రహదారులకు మంచి రోజులు వచ్చాయి. సీఎం చంద్రబాబు గుంతల రోడ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఈ ఏడాది సంక్రాంతిలోగా గుంతల రహదారులను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బీ అధికారులు రహదారుల గుంతల పూడ్చివేత, ఇతర మరమ్మతుల ప్రక్రియ పూర్తిచేశారు. కాకినాడ జిల్లాలో కాకినాడ ఆర్అండ్‌బీ డివిజన్‌లో 64 రోడ్లను గుర్తించి రూ.19.10కోట్లతో గుంతలు పూడ్చారు. పెద్దాపురం డివిజన్‌లో 57 రహదారులకు రూ.10.05కోట్లతో గుంతలు పూడ్చారు. వెరసి కాకినాడ జిల్లాలో గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం రూ.29.15 కోట్లు వెచ్చించింది. కోనసీమ జిల్లాలో 160 రహదారుల్లో గుంతలు పూడ్చినందుకు రూ.38కోట్లను ప్రభుత్వం ఖర్చుచేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 78రహదారుల మరమ్మతుల కోసం రూ.22 కోట్లను వ్యయం చేసింది. వెరసి రూ.89కోట్ల వరకు గుంతల పూడ్చేందుకు ఖర్చుపెట్టింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రహదారులన్నీ అద్దాల్లా మారాయి. ప్రజలకు రోడ్ల కష్టాలు ఐదేళ్ల తర్వాత తీరిపోయాయి. ప్రభుత్వం ఎంత వేగంగా గుంతలు పూడ్చిందో అంతే వేగంగా ఏళ్ల తరబడి జాప్యం చేయకుడా బిల్లుల చెల్లింపు కూడా చేపట్టింది. ఇప్పటివరకు రూ.87కోట్ల బిల్లులకుగాను రూ.57కోట్ల వరకు చకచకా దఫదఫాలుగా చెల్లింపులు చేసింది. రూ.32కోట్ల వరకు బాకీలుండగా, వాటిని కూడా ఈనెలాఖరుకు జమ చేసి నూరు శాతం చెల్లింపులు పూర్తి చేయబోతోంది.

నాడు ఆత్మహత్యలే గతి..

గత వైసీపీ ప్రభుత్వంలో ఏ పని చేసినా కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం అసాధ్యంగా మారింది. కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్లతో ఏ కొత్త రోడ్డు నిర్మించినా, ఆర్బీకేలు, రైతుబజార్లు, సచివాలయాలు, కొత్త పోలీస్‌స్టేషన్ల నిర్మాణం ఇలా ఏ పనిచేసినా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా ఐదేళ్లపాటు వేధించింది. దీంతో ప్రభుత్వం ఏ పనికి టెండర్లు పిలిచినా బిల్లులు ఇవ్వదనే భయంతో అసలు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయడమే మానేశారు. ఇవ్వాల్సిన బకాయిల కోసం కొన్నేళ్లపాటు నిరసనలు, ర్యాలీలు చేపట్టారు. చివరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద బిల్లుల బాకీల కోసం నిరాహారదీక్షలకు దిగారు. బిక్షాటనలు చేశారు. కొందరైతే పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితులు తలెత్తాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపులు లేక చిన్నాపెద్ద కాంట్రాక్టర్లు దివాళా తీశారు. గత వైసీపీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి అనేకమంది కాంట్రాక్టర్లకు కలిపి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.850కోట్లకుపైగా బకాయిలు వదిలిపోయింది. ప్రభుత్వం మారాక అనేక పనులు చకచకా పట్టాలు ఎక్కుతున్నాయి. వీటిని చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం విడతల వారీగా బిల్లులు చెల్లించేస్తోంది. దీంతో ఎక్కడికక్కడ పనుల్లో వేగంతోపాటు కాంట్రాక్టర్లు సైతం పనులు తీసి పనులు చేస్తున్నారు. గుంతల రహదారులు పూడ్చిన రూ.87కోట్ల బిల్లులకు సంబంధించి ఇంకా కాకినాడ జిల్లాలో రూ.18.60కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.4కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో రూ.10కోట్ల వరకే ఇంకా బాకీలున్నాయి. ఇవి ఈనెలాఖరులోగా చెల్లింపులు జరగడానికి వీలుగా రూ.200కోట్లను ఆర్అండ్‌బీకి కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. దీంతో గుంతల రోడ్ల బిల్లుల బాకీలు చెల్లింపులు పూర్తయినట్లే.

అన్నవరం దేవస్థానంలో ఉద్యోగులకు అంతర్గత బదిలీలు

15మందికి స్థానచలనం

అన్నవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో వివిధక్యాడర్లలో ఉన్న పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ ఆలయ ఈవో సుబ్బారావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల వివిధ దేవస్థానాలనుంచి బదిలీపై వచ్చిన వారికి పోస్టింగ్‌లతోపాటు పలువురికి స్థానచలనం కల్పించారు. వీరిలో సూపరింటెండెంట్ తాడిగ్రరాజుకు సెంట్రల్ స్టోర్స్ కోరుకొండ దేవస్థానం బాధ్యతలు అప్పగించగా కేవీ సుబ్రహ్మణ్యానికి ఈవో పేషీ, రిసెప్షన్, వ్రతవిభాగాలు కేటాయించారు. యనమల అప్పారావు, జె.రామకృష్ణలను ఆలయ విభాగ సూపరింటెండెంట్‌లుగా షిఫ్ట్ డ్యూటీలు చేయాలని పేర్కొన్నారు. 15మందిని అంతర్గత బదిలీలు చేయగా మిగిలిన వారు సీనియర్, జూనియర్, రికార్డు అసిస్టెంట్ క్యాడర్లలో ఉన్నారు.

కొబ్బరి మొక్కల పోషక యాజమాన్యంపై శిక్షణ



అంబాజీపేటలోని ఉద్యాన పరిశోధన కేంద్రంలో పీఏసీఎస్ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు

అంబాజీపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కొబ్బరి పంటలో ప్రధాన ఎరువులు, సూక్ష్మపోషకాల వాడకంలో సమతుల్యతను పాటిస్తే కొబ్బరిలో నాణ్యమైన దిగుబడులు పెంచుకోవచ్చునని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి ఎం.ముత్యాలనాయుడు పేర్కొన్నారు. వ్యవసాయ పరపతి సంఘం ఎరువులు డీలర్ల సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా ట్రైనీలకు గురువారం విజ్ఞాన యాత్రను ఏర్పాటు చేసి కొబ్బరి మొక్కల పోషణ, పోషక యాజమాన్యంపై శిక్షణ అందించారు. కొబ్బరి పంటకు కావాల్సిన ప్రథమ, ద్వితీయ పోషకాలు వాటి మోతాదుల్లో సమతుల్యత గురించి శాస్త్రవేత్తలు డాక్టర్ కిరీటి, డాక్టర్ నీరజ ప్రయోగాత్మకంగా వివరించారు. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో పనిచేసే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రతినిధులకు సమగ్ర పోషక యజమాన్యంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సు కోసం ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఏరువాక కేంద్రంలో ఈనెల 9వతేదీ నుంచి ప్రారంభించామన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందిస్తామన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ట్రైనీ కలెక్టర్ల పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం ట్రైనీ కలెక్టర్‌లు

అన్నవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం పలువురు ట్రైనీ కలెక్టర్‌లు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ విభాగ ప్రొటోకాల్ అధికారి భాస్కరప్రసాద్ తదితరులున్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు అన్నవరం విద్యార్థుల ఎంపిక



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ సత్యనారాయణ

అన్నవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అనంతపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చి అన్నవరం విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కేవీ సత్యనారాయణ తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో టి.కార్తీకరాజు, యు.లోకేశ్వరస్వామి, ఎన్.తన్వీర్ సత్యం బంగారు పతకాలు సాధించారన్నారు. వీరు ఈనెల 23నుంచి జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని శారదా విద్యాలయం కరస్పాండెంట్ కృష్ణవర్మ, ప్రిన్స్‌పాల్ బోనగిరి శ్రీనివాస్ సత్యదేవ తైక్వాండో సభ్యులు అభినందించారు.

దాట్ల దేవదానంరాజుకు 'రావిశాస్త్రి' పురస్కారం



యానాం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన రావిశాస్త్రి లిటరరీ ట్రస్టుకు సంబంధించి రావిశాస్త్రి సాహిత్య పురస్కారానికి యానానికి చెందిన ప్రముఖ కవి దాట్లదేవదానంరాజు ఎంపికయ్యారు. స్థానికతను జోడించి వైవిధ్యమైన కథలు రచించినందుకు ఈపురస్కారం అందిస్తున్నామని కన్వీనర్ డీవీ సూర్యారావు తెలిపారు. జూలై 30న రాచకొండ విశ్వనాథశాస్త్రి జయంతి రోజున విశాఖ పౌరగ్రంథాలయంలో పురస్కార సభ జరగనుందన్నారు. సాహిత్య జీవితంలో కథలపట్ల ఇష్టాన్ని, ప్రేమని కలిగించిన రావిశాస్త్రి పేరుమీద ఇస్తున్న పురస్కారం ఎంతో సంతోషం కలిగిస్తోందని, అదే వేదిక మీద 'మనిషి లోపలి నీడ' అరవ కథా సంపుటి ఆవిష్కరిస్తామని దేవదానంరాజు తెలిపారు. ఆయన్ను పి.విష్ణుమూర్తి, డాక్టర్ శిఖమణి, వరుగు భాస్కరరెడ్డి, చింతా కొండలరావు, మధునాపంతుల, పొనుగుమట్ల అశోక్ కుమార్ అభినందించారు.

అమాయకులే టార్గెట్..!

- ఏటీఎంల వద్ద కార్డులు మార్చి చోరీలు
- ఇద్దరు అంతర్ జిల్లాల దొంగలు అరెస్టు
- రూ. ఐదు లక్షల చోరీ సొత్తు, 27 నకిలీ ఏటీఎం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్
- సీఐ, క్రైం పార్టీ బృందానికి రివార్డులు


విలేఖరులతో మాట్లాడుతున్న డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, సీఐ వీరబాబు, ఎస్ఐ కిశోర్, పక్కన స్వాధీనం చేసుకున్న నగదు

అమలాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలకు వచ్చే అమాయక కస్టమర్లనే వారు లక్ష్యంగా చేసుకుని నకిలీ కార్డులు ఇచ్చి అసలు కార్డులతో ఖాతాల్లోని సొమ్మును కాజేస్తున్నారు. అయితే ఎట్టకేలకు ఇద్దరు అంతర్ జిల్లాల దొంగలు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి సుమారు రూ. ఐదు లక్షల నగదు, 27 నకిలీ ఏటీఎం కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ వివరాలను వెల్లడించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ గజేంద్రకుమార్, పట్టణ ఎస్ఐ ఎన్ఆర్ కిశోర్‌బాబు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేసేందుకు వచ్చే అమాయకులకు సహాయం చేస్తున్నట్టు నటించి, వారి వద్ద నుంచి అసలు ఏటీఎం కార్డులు లాగేసుకుని నకిలీ కార్డులు వారికి ఇస్తున్నారు. అలాగే పిన్ నెంబర్లు తెలుసుకుని దఫదఫాలుగా నగదు విత్‌డ్రా చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం గ్రామానికి చెందిన పళ్లా సురేష్‌కుమార్, విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పారాది గ్రామానికి చెందిన తాడ్డి లక్ష్మణరావును అరెస్టు చేసినట్టు డీఎస్పీ పేర్కొన్నారు. ఈయన గతంలో అంతర్ జిల్లాల్లో భారీగా కేసులు ఉన్నాయన్నారు. అలాగే నరేంద్రకుమార్‌కు గతంలో నేర చరిత్ర ఉంది. కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, విజయనగరం జిల్లాల్లో సుమారు 60 కేసుల్లో నాలుగు సార్లు జైలుకు వెళ్లగా, రెండు సార్లు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు, ఒకసారి అనకాపల్లి సబ్‌జైలు, మరోసారి మచిలీపట్నం సబ్ జైలులో రెండున్నర సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపాడు. అమలాపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఏటీఎం సెంటర్లలో డబ్బులు చోరీ అవుతున్న కేసులకు సంబంధించి విచారించగా, ఈ ముద్దాయిలను పట్టుకున్నట్టు తెలిపారు. వీరిపై అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో 7, ముమ్మిడివరం, రావులపాలెం 1, నగరం, 1, పామర్రు 1, రామచంద్రపురం 1, తణుకు 1, మొత్తం 15 కేసులు నమోదయ్యాయన్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు, క్రైం సీఐ ఎం.గజేంద్రకుమార్ నాయకత్వంలో ఎస్ఐ ఎన్.కిశోర్‌బాబు, క్రైం ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, ఇతర క్రైమ్ పార్టీ సిబ్బంది కలిసి సంయుక్తంగా నిందితులను పట్టుకోవడానికి కృషి చేశారు. వీరిని డీఎస్పీ ప్రసాద్ అభినందించడంతో పాటు నగదు రివార్డును కూడా అందజేస్తామని వెల్లడించారు. సమావేశంలో ఏఎస్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

పర్యాటకుల .. కారు దగ్ధం


కాలిపోతున్న కారు

మోతుగూడెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మోతుగూడెం పరిధి పొల్లూరు-మల్లవరం మధ్యలో గురువారం సాయంత్రం ఓ కారు దగ్ధమైంది. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం కొత్తపాలెం నుంచి వచ్చిన పర్యాటకులదిగా గుర్తించారు. ఏపీ 39 కేహెచ్ 553 నెంబర్ గల కారులో షార్ట్‌సర్క్యూట్ అవ్వడంతో ఇంజన్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో కారు మొత్తం కాలిపోయింది. అం దులో ఉన్నవారంతా సురక్షితంగా బయటపడ్డారు. దీంతో పెద్దప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మోతుగూడెం ఎస్ఐ సాదిక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా...

- ఆటోను ఢీకొన్న వ్యాన్
- ముగ్గురు మృతి, ఒకరి పరిస్థితి విషమం
- పిఠాపురం మండలం విరవ పీహెచ్‌సీ సమీపంలో ప్రమాదం


రోడ్డుపై పడి ఉన్న మృతదేహాలు, నుజ్జునుజ్జయిన ఆటో (ఇన్‌సెట్లో)

పిఠాపురం / పిఠాపురం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవ పీహెచ్‌సీ సమీపంలో గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యాన్, ఆటో ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే ... పిఠాపురం మండలం మల్లాం గ్రామానికి చెందిన కాలదారి రాజబాబు (40), గాలింకి కన్నబాబు (43), గుద్దటి చినబాబు (40), కాలదారి రమేష్ మల్లాంలో జరిగిన శుభకార్యానికి హాజరై రాజబాబుకు చెందిన ఆటోలో తిరిగి విరవాడ వస్తున్నారు. ఈ క్రమంలో విరవ పీహెచ్‌సీ సమీపంలోకి వచ్చేసరికి పిఠాపురం నుంచి దివిలి వెళ్తున్న వ్యాన్ ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో నడుపుతున్న కాలదారి రాజబాబు అక్కడికక్కడే మృతి చెందగా, కన్నబాబు, చినబాబు, రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కన్నబాబు, చినబాబును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా కన్నబాబు మరణించాడు. అలాగే చినబాబు కూడా పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రమేష్ పరిస్థితి విషమంగా ఉంది.

● ఆనందం, అంతలో విషాదం

ఆ శుభ కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరూ సంతోషంగా గడపగా, సాయంత్రం జరిగిన ప్రమాదంతో గ్రామంలో ఒక్కసారి విషాదం నెలకొంది. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు భోరున విలపిస్తున్నారు. మృతుల్లో ఒకరైన గాలింకి కన్నబాబు, విరవకు చెందిన రమేష్ హైదరాబాదులో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం పడిన తల్లికి వందనం డబ్బులు తీసుకునేందుకు ఇక్కడకు వచ్చి ప్రమాదానికి గురయ్యారు. మృతులు రాజబాబుకి భార్య, ఇద్దరి పిల్లలు, కన్నబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మారెళ్లమూడిలో ఘరానా మోసం

- తక్కువ రేటుకు సిమెంట్ ఇప్పిస్తానని రూ. 25 వేలతో ఉడాయింపు
- లబోదిబోమంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు


డబ్బులతో పరారైన గుర్తు తెలియని వ్యక్తి

నల్లజర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థికనేరాలు రోజురోజుకు పెచ్చుమీరిపోతున్నాయి. కేటుగాళ్లు రోజుకో ప్లాన్ వేసు కుని అమాయక ప్రజల కష్టాన్ని దోచేసు కుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. నల్లజర్ల మండలం మారెళ్లమూడికి చెందిన కాసాని రాంబాబు వద్దకు గురువారం ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి చాలా తక్కువ ధరకు సిమెంట్ ఇప్పిస్తానని నమ్మబలికి రూ.25 వేలు తీసుకున్నాడు. ఇటీవల రాంబాబు ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. ఈ క్రమంలో సదరు గుర్తు తెలియని వ్యక్తి యాని కార్న్ బైక్‌పై వచ్చి తాను హోల్‌సేల్‌గా సిమెంట్ బస్తాలను షాపులకు వేస్తుంటాను. మీకు చాలా తక్కువ ధర (బస్తా రూ.250)కు మీ ఇంటి వద్దకే లారీని తెచ్చి వేస్తానని నమ్మబలికాడు. మీకు ఒకవేళ నమ్మకం లేకపోతే నల్లజర్ల శ్రీలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్‌కు రావాలని చెప్పడంతో అది నిజమని నమ్మిన రాంబాబు డబ్బును ఇచ్చాడు. తర్వాత సదరు మోసగాడు తన బండిపై ఎక్కించుకుని నల్లజర్ల వెళుతుండగా, మార్గమధ్యలో బైక్‌కు గాలి తగ్గింది. ఇక్కడే ఉండు లారీ వస్తుంది ... సిమెంట్‌ను ఇంటికి తీసుకుని వెళ్లు అని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. తీరా ఉదయం నుంచి సాయంత్రం వరకు చూసిన బాధితుడు సిమెంట్ లారీ రాకపోవడంతో మోసపోయినట్టు గ్రహించి నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి

- వేమగిరి జాతీయ రహదారిపై ఘటన


ప్రమాదంలో మృతి చెందిన శివానందరెడ్డి

కడియం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన చెందిన సత్తి శివానందరెడ్డి (43) గురువారం రాజమహేంద్రవరం నుంచి వేమగిరి వైపు మోటారుసైకిల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో కడియం మండలం వేమగిరి జాతీయ రహదారిపై పాయిజన్ దాబా సమీపంలో అతడిని వెనుక నుంచి వస్తున్న టిప్పర్ బలంగా ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సెల్‌ఫోన్ల షాపులో భారీ చోరీ

- రూ. పది లక్షల విలువైన ఫోన్లు మాయం
- కేసు నమోదు

సామర్లకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-పెద్దాపురం ప్రధాన రహదారి రింగ్‌సెంటర్ సమీపంలో ఉన్న ఒక సెల్‌ఫోన్ షాపులో గురువారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. దీనికి సంబంధించి వివరాలివి... షాపు షట్టర్‌ను గునపంతో పెకిలించి అందులోని ఫోన్లను ఆగంతకులు అపహరించుకుపోయారు. నిత్యం జనసమూహం, వాహనాల రాకపోకలతో ఉండే ఈ రోడ్డులో ఇంతటి భారీ చోరీ జరగడంతో ప్రజలంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బుధవారం రాత్రి షాపు మూసివేసే ముందు ఆ రోజు నగదు కూడా పెట్టిలో ఉంచినట్టు షాపు యజమాని సామర్లకోట పోలీసులకు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సామర్లకోట పోలీసులతో పాటు కాకినాడ నుంచి వేలిముద్రల నిపుణులు, క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలికి చేరు కుని వివరాలు సేకరించారు. కాగా రాత్రివేళల్లో కనీసం ప్రధాన రహదారుల్లో పోలీసులు గస్తీ తిరగకపోవడం వల్లే వరుస చోరీలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సీసీ ఫుటేజీలను సైతం పోలీసులకు అందించినా.. కేసు దర్యాప్తులో ఎటువంటి పురోగతి ఉండడం లేదని బాధితులు వాపోతున్నారు. దీనిపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



పిఠాపురం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం జల్లూరు శివారు కోదండరామపురం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారపురం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ షైనపాటి అప్పారావు (49) మృతిచెందారు. సామర్లకోటలో జరిగిన ఓ శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లి మోటార్‌సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొట్టింది. దీంతో అప్పారావు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఇతనికి భార్య ప్రమీలాదేవి, కుమార్తె సుప్రియ ఉన్నారు. పిఠాపురం రూరల్, సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

పకడ్బందీగా టర్మ్‌ఎండ్ పరీక్షల నిర్వహణ

ఇగ్నో స్టడీసెంటర్ సందర్శించిన ప్రాంతీయ సంచాలకుడు కృష్ణారావు


ప్రిన్సిపాల్ రామచంద్రరావుతో మాట్లాడుతున్న ఆర్డీ కృష్ణారావు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జూన్ టర్మ్‌ఎండ్ పరీక్షల నిర్వహణ పక్కాగా నిర్వహించాలని ఇందిరాగాంధీ జాతీయ ఓపెన్ యూనివర్శిటీ(ఇగ్నో) విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకుడు ఈ.కృష్ణారావు అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇగ్నో స్టడీ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టర్మ్‌ఎండ్ పరీక్షల నిర్వహణకు సంబంధించి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీ కృష్ణారావు.. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావును ఆయన కార్యాలయంలో కలసి పలు అంశాలపై మాట్లాడారు. రీజనల్ సెంటర్ తరఫున కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, జువాలజీ, జియో ఇన్‌ఫర్మేటిక్స్, కంప్యూటర్ సైన్స్ వంటి పీజీ కోర్సులు, బీసీఏ కోర్సు ప్రారంభించాలనే ఆలోచన ఉన్నదని తెలియజేశారు. అనంతరం కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, జియాలజీ శాఖల అధిపతులతో సమావేశమయ్యారు. డిజిటల్ ల్యాబ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంలో కేంద్ర సమన్వయకర్త ఎంఆర్ గౌతమ్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ సునీల్‌కుమార్, స్టడీసెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్ల ప్రయాణ తేదీల పొడిగింపు

రాజమహేంద్రవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాకినాడ టౌన్-చర్లపల్లి, లింగంపల్లి రైళ్ల ప్రయాణ తేదీలను 2026 మార్చి 31 వరకూ పొడిగించామని రైల్వే అధికారులు తెలిపారు. రైలు నెం.07447 కాకినాడ-చర్లపల్లి రైలు ప్రతి శనివారం, 07448 చర్లపల్లి-కాకినాడ టౌన్ రైలు ప్రతి ఆదివారం, 07445 కాకినాడ టౌన్-లింగంపల్లి రైలు ప్రతి సోమ, బుధ, శుక్ర వారాల్లో, 07446 లింగంపల్లి-కాకినాడ టౌన్ రైలు ప్రతి మంగళ, గురు, శని వారాల్లో రాకపోకలు సాగిస్తాయన్నారు. ఈ రైళ్లు రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు మార్గం గుండా ప్రయాణిస్తాయి.

ప్రాథమిక పాఠశాలకు తాళాలు

మోడల్ ప్రైమరీ స్కూల్‌గా చేయాలంటూ ములికిపల్లిలో తల్లిదండ్రుల నిరసన


పాఠశాలకు తాళాలు వేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రాజోలు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలంలోని ములికిపల్లిలోని బాలయోగి కాలనీలో మండల ప్రజాపరిషత్ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా చేయాలంటూ విద్యార్థుల తల్లింద్రులు గురువారం పాఠశాలకు తాళాలు వేశారు. ఈ పాఠశాలలో 1వ తరగతిలో ఎనిమిది మంది, 2వ తరగతిలో 13 మంది, 3, 4, 5 తరగతుల్లో 39 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో 1, 2 తరగతులు కొనసాగించి, 3, 4, 5 తరగతులకు చెందిన 39 మంది విద్యార్థులను పక్క గ్రామంలో ఉన్న కూనవరం మోడల్ ప్రైమరీ పాఠశాలలో కలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ములికిపల్లిలోని ఎంపీపీ పాఠశాలకు వచ్చి తాళాలు వేసి నిరసన తెలిపారు. మోడల్ ప్రైమరీ పాఠశాలగా చేయాలంటూ నినాదాలు చేశారు. చిన్నారులను స్కూలు బ్యాగులతో ప్రధాన రహదారిపై అంత దూరం పంపలేమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ములికిపల్లి ఎంపీపీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని రాజోలు ఎంఈవో ఎస్. మనోహరం తెలిపారు.

స్త్రీనిధిలో భారీగా అవకతవకలు

- గిరిజన ప్రాంత లావాదేవీలను ఆపరేట్ చేస్తున్న కోనసీ అధికారి!
- రంగంలోకి ఉన్నతాధికారులు
- రెండు గ్రామాల్లో డీజీఎం దర్యాప్తు

రాజవొమ్మంగి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత లావాదేవీలను తన లాగిన్‌లో యాక్సెస్ చేయడం, ఇక్కడ లావాదేవీలను ఆ అధికారి నమోదు చేయడంతో స్త్రీనిధి ఉన్నాతాధికారులు భారీ అవకతవకలను గుర్తించారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని శరభవరం వీవో, రాజవొమ్మంగి-4 వీవో పరిధిలో స్త్రీనిధి రుణాలు పొందిన డ్వాక్రా సంఘాలు వారి ఖాతాల నుంచి స్త్రీ నిధి ఖాతాలకు రుణబకాయిలు చెల్లించాల్సి ఉంది. అయితే డ్వాక్రా సంఘం ఖాతా, వీవో ఖాతాకు సంబంధం లేకుండా వేరే మార్గం ద్వారా డబ్బులు చెల్లించడం, చాలాసార్లు చెల్లింపు చేయకపోవడం, చెల్లింపు చేసిన వివరాలను కోనసీమ జిల్లాకు చెందిన అధికారి లాగిన్ నుంచి నమోదు చేయడంతో స్త్రీనిధి ఉన్నతాధికారులు తప్పు జరుగుతున్నట్టు గుర్తించారు. దీంతో గురువారం మండలంలోని శరభవరం, రాజవొమ్మంగి గ్రామాల్లో స్త్రీనిధి అడ్మిన్ డీజీఎం రమణరెడ్డి, జోనల్ డీజీఎం శ్యామలాదేవి సమగ్ర దర్యాప్తు నిర్వహించారు. అయితే ఎంత తేడా జరిగింది, ఎవరిపై చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను అధికారులు వెల్లడించలేదు.

వచ్చే నెల 5న జాతీయ లోక్ అదాలత్

అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలి: పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జూలై 5వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ఉమ్మడి జిల్లాలోని బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులు గతం కంటే పెద్ద సంఖ్యలో పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలన్నారు. అదనపు జిల్లా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా పరిష్కరించడంతోపాటు బాధితులకు పరిహారం అందజేసే విధంగా చొరవ చూపాలన్నారు. రాజీకి అర్హమైన కేసులన్నీ పరిష్కారం కావాలంటూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏపీపాలిసెట్ కౌన్సెలింగ్

25 నుంచి ఆప్షన్ల నమోదు
ఏపీటీ ప్రిన్సిపాల్ జనార్దనరావు

కాకినాడ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లోని డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీపాలిసెట్-2025 కౌన్సెలింగ్ శనివారం ప్రారంభం కానుందని, విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించనున్నామని కాకినాడ ఏపీటీ ప్రిన్సిపాల్ నల్లి జనార్దనరావు తెలిపారు. పాలిసెట్ ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు తమక సమీపంలోని సహాయకేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావచ్చన్నారు. ఈనెల 27లోపు http://polycet.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ర్యాంకులు వారీగా ఈ నెల 21 నుంచి 28వరకూ ఫిజికల్‌గా హాజరై ధ్రువపత్రాలను పరిశీలన చేయించకోవాలని సూచించారు. 25 నుంచి 30 వరకూ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, జూలై 1వరకూ ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని, 3న సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. 21న 1నుంచి 15000 ర్యాంకు, 22న 15001 నుంచి 32000 ర్యాంకు, 23న 32001 నుంచి 50000 ర్యాంకు, 24న 50001 నుంచి 68000 ర్యాంకు, 25న 68001 నుంచి 86000 ర్యాంకు, 26న 86001 నుంచి 104000 ర్యాంకు, 27న 104000 నుంచి 120000 ర్యాంకు, 28న 120001 నుంచి చివరి ర్యాంకు వరకూ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సానుకూల రాజకీయ వాతావరణం

- ఇన్‌చార్జిల నియమాకాలు త్వరగా పూర్తి చేయాలి
- టీడీపీ రాష్ట్ర మైనార్టీ ఎఫైర్స్ సలహాదారుడు ఎండీ షరీఫ్


పి.గన్నవరం సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

పి.గన్నవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కలయికతో రాష్ట్రంలో సానుకూల రాజకీయ వాతావరణం నడుస్తోందని రాష్ట్ర మైనార్టీ ఎఫైర్స్ సలహాదారుడు, మాజీ శాసన మండలి చైర్మన్ ఎండీ షరీఫ్ అన్నారు. పి.గన్నవరం టీడీపీ కార్యాలయంలో కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షత జరిగిన నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. చంద్రబాబు సుదీర్ఘ రాజకీయ అనుభవం కల్గిన వ్యక్తి అని మరో పదేళ్లు ఆయనే సీఎంగా ఉండాలని పవన్‌కళ్యాణ్ ఓ సందర్భంగా పేర్కొన్నారని నాయకులకు గుర్తు చేశారు. ఒక్క చాన్స్ పేరుతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని మండిపడ్డారు. వైసీపీ పాలన ఐదేళ్లలో వారి అకృత్యాలు, చంద్రబాబును 53 రోజులు పాటు జైలు పాలు చెయ్యడం వంటి అంశాలను ప్రజలు గమనించి సార్వ త్రిక ఎన్నికల్లో 151 సీట్లును కాస్త 11 స్థానాలకు పరిమితం చేశారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు ఒక విజన్‌తో పార్టీ బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. 2029 ప్రభుత్వం ఉండాలన్నది వారి ఉద్దేశ్యం కాదని భవిష్యత్తులో మరో పది నుంచి పది హేను ఏళ్లు పార్టీ బలంగా ఉండాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయి నుంచి ప్రత్యేక దృష్టి కనబరిచారని స్పష్టం చేశారు. పార్టీ సూచించిన క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, ఇన్‌చార్జిల నియమాకాలను త్వరగా పూర్తి చేసుకుని వివరాలను రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని సూచించారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో సామాజిక వర్గాలు వారీగా అందరికి సమానమైన అవకాశాలు కల్పించాలన్నారు. ఈసారి మండలాధ్యక్ష పదవిని అగ్నికుల క్షత్రీయులకు కేటాయించాలని కోరుతు శేరు శ్రీనుబాబు షరీఫ్‌తో పాటు పలవురికి వినతిపత్రాలు అందించారు. సమావేశంలో పోలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, షేక్ సుభాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.51,50,542


అప్పనపల్లి బాలబాలాజీ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.51,50,542 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలియచేశారు. 85 రోజులుకు హుండీ లెక్కింపును గురువారం నిర్వహించారు. ఈ ఆదాయంతో పాటు 8.006 గ్రాముల బంగారం, 1.85 గ్రాముల వెండి, యూఎస్ఏ డాలర్లు 13,యూకే ఫౌండ్స్ 10, మలేషియా రింగిట్స్ 9, కువైట్ దినార్ 1.50 ఆదాయంగా వచ్చినట్టు తెలిపారు. లెక్కింపుకు పర్యవేక్షణాధికారిగా అంతర్వేది దేవస్థాన సహాయ కమిషనర్ ఎంకేటీవీఎన్ ప్రసాద్, అమలాపురం ఎగ్జిక్యూటివ్ అఫీసర్ ఆర్.శ్రీనివాస్ హాజరయ్యారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం

ఆసుపత్రికి తరలింపు.. తప్పిన ప్రాణాపాయం

మండపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వ్యక్తి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. మండపేట రూరల్ ఎస్ఐ వి.కిషోర్ తెలిపిన వివరాలు ప్రకారం.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడికి చెందిన ఒక వివాహిత భర్తను కోల్పోయి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సత్తింశెట్టి సాయి ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఆ వేధింపులు భరించలేక సదరు వివాహిత గురువారం ఇంటిలో ఉన్న థైరాయిడ్ మాత్రలు అధిక మొత్తంలో వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో ఆమెను తల్లిదండ్రులు హుటాహుటిన స్థానికంగా వున్న ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా ప్రాణాపాయం నుంచి బయటపడింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పబ్లిక్ నోటీస్

ఈ ప్రకటన ద్వారా ప్రజానీకానికి తెలియజేయడమైనది **శ్రీ చిట్టూరి ప్రవీణ్ చౌదరి** (ఉద్యోగ ఐడి: 280008) గారు ఆంధ్రా పేపర్ లిమిటెడ్, రాజమహేంద్రవరం యూనిట్లో **స్టాక్ ప్రిపరేషన్ విభాగంలో ఆపరేటర్**గా పనిచేస్తున్న వారు, **తక్షణం సేవల నుండి తొలగించబడ్డారని** తెలియజేయడమైనది.

ఈ ప్రకటన తేది నుండి పై ఉద్యోగి గారితో సంస్థ తరుపున ఎలాంటి లావాదేవీలు జరిపినా ఆ బాధ్యత సంస్థకి ఉండదని తెలియజేస్తున్నాము.

తేది: 19-6-2025
స్థలం: రాజమహేంద్రవరం

ఆంధ్రాపేపర్ లిమిటెడ్ తరపున
మేనేజ్‌మెంట్

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు



యోగా కార్యక్రమంలో మాట్లాడుతున్న కిమ్స్ సంస్థల చైర్మన్ సత్యనారాయణరాజు, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావు

ఆరోగ్యం..ఆధ్యాత్మికతకు

యోగా మార్గదర్శకం

● ఎంపీ హరీష్‌మాధుర్, ● కిమ్స్‌లో యోగాభ్యాసన కార్యక్రమం

అమలాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం ఆధ్యాత్మిక చైతన్యానికి యోగా మార్గదర్శకంగా నిలుస్తోందని అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌మాధుర్ అన్నారు. అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం నిర్వహించిన యోగా కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది, వైద్యులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కిమ్స్ వ్యవస్థాపక చైర్మన్ కేవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షత వహించారు. ఎంపీ హరీష్ మాధుర్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు తమ వ్యక్తిగత జీవితంలో యోగాను అలవరచుకోవడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చునని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆరోగ్యపరమైన జీవనశైలికి యోగా ఎంతో ప్రయోజనకరం అవుతుందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ యోగాపై అవగాహన కల్పించేందుకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చామన్నారు. సచివాలయ స్థాయి నుంచి ట్రైనర్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు రిజిస్ట్రేషన్‌చేసి మూడు దశల్లో వారిని నియమించామన్నారు. ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు నిర్వహించాలని కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు విజ్ఞప్తి చేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, కిమ్స్ వైస్‌చైర్మన్ మోహన్‌రాజు, డీఆర్వో రాజకుమారి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, ప్రముఖవైద్యులు, వివిధ శాఖల అధికారులు వేదికపై పాల్గొన్నారు. అనంతరం వేలాది మందితో యోగాభ్యసన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం: ప్రతిఒక్కరూ యోగా అలవాటు చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఈనెల 17 నుంచి 21 వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 21న విశాఖలో జరిగే కార్యక్రమానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు హాజరవుతారని అన్నారు.



మురమళ్లలో యోగా చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

యోగాతో మానసిక ప్రశాంతత

అంబాజీపేట: యోగాతో మానసిక ప్రశాంతతోపాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వ్యవసాయాధికారి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి బోసుబాబు అన్నారు.అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో బీమారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో అడపా వెంకటకృష్ణ, హెచ్‌ఎం సాయిరాం, పీడీ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యోగా చిత్రాలు

మామిడికుదురు: యోగా డేను పురస్కరించుకుని ఈదరాడ హైస్కూలు విద్యార్థులు గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. యోగాసనాలను తెలియచేస్తూ విద్యార్థులు అబ్బుర పరిచే రీతిలో ఈ చిత్రాలు గీసి ప్రదర్శించారు. యోగా వల్ల కలిగే లాభాలను ప్రధానోపాధ్యాయుడు జి.సాయిబాబా తెలియచేశారు. గురువారం డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ చిత్రాలు ప్రదర్శించారు.



యోగాను తెలియచేస్తూ గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

టీడీపీకి కార్యకర్తలే మూలస్తంభాలు

● శాసనమండలి మాజీ చైర్మన్ మహ్మద్ షరీఫ్

మలికిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలని శాసనమండలి మాజీ చైర్మన్ మహ్మద్ షరీఫ్ అన్నారు. గురువారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన రాజోలు నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల సమావేశంలో ముఖ్యఅతిథిగా మహ్మద్‌షరీఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి తొమ్మిది నెలల కాలంలో అధికారంలోకి తెచ్చి చరిత్ర సృష్టించిన నాయకుడన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పార్టీని విడిచిపెట్టిన దాఖలాలు ఎక్కడా లేవని, పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు పార్టీతోనే ప్రయాణం కొనసాగిస్తున్నారన్నారు. రాజోలు నియోజకవర్గంలో క్రమశిక్షణ గల కార్యకర్తలు ఉన్నారని, ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా పార్టీని విడిచి పెట్టకుండా పార్టీతోనే ప్రయాణం చేస్తున్నారని అన్నారు. సంస్థాగత ఎన్నికల్లో భాగంగా 60 గ్రామాల్లో ఇప్పటి వరకు సుమారు 54 గ్రామాలను పూర్తి చేసుకున్నామని, త్వరలో కుటుంబ సాధికారిత సారథులను గ్రూపు కమిటీ కన్వీనర్లను, యూనిట్ ఇన్‌చార్జిలను, క్లస్టర్ ఇన్‌చార్జిలను నియమించుకుని గ్రామస్థాయిలో పార్టీని బలపరుచుకుని ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. చిటికెల రామ్మోహనరావు, తాడి నరసింహారావు, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, మంద గంగసూర్యనారాయణ, కరుటూరి నరసింహారావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కేతా శ్రీనివాస్, మంగెన భూదేవి, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మొల్లేటి శ్రీనివాస్, చాగంటి స్వామి, బందెల పద్మ, హెలీన పాల్గొన్నారు.

ఉప్పునీటి సమస్యను పరిష్కరించి ఆదుకోండి

● ఎమ్మెల్యే, ఎంపీలకు రైతుల వినతి



ఎమ్మెల్యే ఆనందరావుతో మాట్లాడుతున్న రైతులు

ఉప్పలగుప్తం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మేజర్ డ్రెయిన్ ద్వారా ఉప్పునీరు పంటకాల్వల్లోకి ప్రవహించి పొలాలను ధ్వంసం చేస్తోందని రైతులు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు ఆధ్వర్యంలో రైతులు గురువారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉప్పునీరు పొలాల్లోకి రావడంతో ఏటా సార్వాను వదులుకుంటున్నామని అన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కూనవరం మేజర్ డ్రెయిన్‌లో ఆటోమేటిక్ రెగ్యులేటరీ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అడిగారు. అనంతరం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు వినతిపత్రం సమర్పించారు. నీటిసంఘాల చైర్మన్లు నల్లా సత్యనారాయణ, మోటూరి రవి, రైతు నాయకులు చిక్కం పెద్దబ్బులు, అడబాల సత్యనారాయణ, చిక్కం పెదబాబు, గొలకోటి సత్తిరాజు, రవణం మధు, గొలకోటి శ్రీనివాసరావు, నాగులపల్లి రాజు, చిక్కం వెంకటకృష్ణ, పెయ్యల దుర్గారావు, మారిశెట్టి రమేష్, ఆకేటి వెంకన్న, సలాది గణపతి, తాళ్ళ రవి పాల్గొన్నారు.

ఆక్వా రైతులు ఎంపెడా సేవలు వినియోగించుకోండి : జేటీవో



యాంటీ బయోటిక్ మందులు వాడవద్దంటూ ఆక్వా రైతులతో కలిసి ర్యాలీ చేస్తున్న జేటీవో బంగారమ్మ

అంతర్వేది, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతులకు అందించే సబ్సిడీ పథకాలను ప్రతీఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపెడా జేటీవో బంగారమ్మ కోరారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన ఎంపడ ఆక్వా రైతుల సమావేశానికి జేటీవో బంగారమ్మ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా రైతులకు సబ్సిడీ స్కీమ్‌లు ఎన్నో ఉన్నాయని, వాటిని ప్రతీ రైతు సకాలంలో వినియోగించుకుని అధికదిగుబడులు వచ్చే రొయ్యల సాగును పండించాలన్నారు. ఎంపడ స్కీమ్ కోసం, యాంటీ బయోటిక్స్ వాడకంవల్ల జరిగే నష్టాలను వివరించారు. ఫీల్డు మేనేజర్ సునీల్ మాట్లాడుతూ ఎన్‌పీసీఎస్‌ఏ ఎంపడ సీడ్ సబ్సిడీ, స్కీమ్స్ కోసం, కోఆపరేటివ్ సొసైటీలు, లేబోరేటరీల కోసం మాట్లాడారు. అలాగే సీఏఏ కగేష్ మాట్లాడుతూ సీఏఏ లైసెన్సు కోసం వాటి ఉపయోగాన్ని వివరించారు. అనంతరం రైతులతో జేటీవో బంగారమ్మ యాంటీ బయోటిక్స్ వాడకుండా ఉండాలని రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోతురాజు నరసింహారావు(కిశోర్), ఫీల్డు మేనేజర్ పి.సునీల్, సీఏఏ కగేష్, రైతులు లక్కు సత్యనారాయణ, బెల్లంకొండ శ్రీనివాసరావు, తోట సురేష్, ఇండియన్ ఆయిల్ బంకు యజమాని బెల్లంకొండ వెంకటేశ్వరరావు(శ్రీను), వార్డు మెంబర్ బెల్లంకొండ రాంబాబు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా టవర్ల ఏర్పాటు

అమలాపురంటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం, ముమ్మిడివరం డబుల్ సర్క్యూట్ లైన్‌లో ఉన్న 30 విద్యుత్ టవర్లను పెద్దగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో పూర్తిచేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల మార్చి 27న కొత్తపేటలో ఒక విద్యుత్ డబుల్ సర్క్యూట్ లైన్ టవర్ కుప్పకూలడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వం 30 సర్క్యూట్ డబుల్ లైన్ల టవర్లు మార్పు చేయాలని ఆదేశించిందన్నారు. వరి సాగులో ఉండడంతో కొంత జాప్యం జరిగిందన్నారు. ఎట్టకేలకు 30 టవర్లను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌ఈ గిరిబాబు, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ ఎస్.రాజబాబు, కార్యనిర్వాహక ఇంజనీర్లు కె.రత్నాలరావు, కె.రాంబాబు, శ్రీధర్, వై.విజయానంద్, ఇరు విభాగాల ఇంజనీర్లు పాల్గొనగా వారిని కలెక్టర్ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నెల 20వ తేదీ శుక్రవారం ఉప్పలగుప్తం, చల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, జగ్గరాజుపేట, గొల్లవిల్లి, వాడపర్రు, కూనవరం, కిత్తనచెరువు, చీకట్లపాలెం, సన్నవిల్లి, సూదాపాలెం, భట్టుపాలెం, నంగవరం, భీమనపల్లి, సింగరాయపాలెం, విలసవిల్లి, మునిపల్లి, చినగాడవిల్లి, పెదగాడవిల్లి, వానపల్లిపాలెం, ఎస్.కొత్తపల్లి, రాఘవులపేట గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టి.చల్లపల్లి, గోపవరం, సరిపల్లి, ఎస్.యానాం, వాసాలతిప్ప, నక్కారామేశ్వరంకు సరఫరా ఉండదన్నారు.

మహిళలకు పీచు బొమ్మల తయారీపై శిక్షణ

మామిడికుదురు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కొబ్బరి పీచుతో తయారుచేసే బొమ్మల తయారీపై మహిళలకు శిక్షణ కార్యక్రమం ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతుంది. పాశర్లపూడి బాడవలో డిజైన్ డెవలెప్మెంట్ వర్కుషాపు పేరిట కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు ఈ శిక్షణ ఇస్తున్నారు. గత నెల ప్రారంభమైన శిక్షణ ఈ నెల 29 వరకు జరుగుతుంది. అప్పనపల్లి, పాశర్లపూడి, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన మహిళలు ఈ శిక్షణకు హాజరవుతున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు కె.గంగాధరం తెలిపారు.

వెంకటేశ్వర కళాశాలలో జాబ్‌మేళా

అమలాపురంటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో గురువారం ఎంఎస్‌ఎన్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. కంపెనీ హెచ్‌ఆర్‌లు శివరామ్‌ప్రసాద్, కర్రి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులు పాల్గొనగా రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. 20 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఒక్కొక్కరికీ వార్షిక వేతనం కింద రూ.2.5లక్షలు చెల్లిస్తారు. ఎంపికైన వారికి కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎన్ మనోహర్, కరస్పాండెంట్ నరసింహారావులు నియామక పత్రాలను అందజేశారు.

22న అసిస్టెంట్ టైర్-2 రాత పరీక్ష

యానాం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి టైర్-2 రాత పరీక్షను ఈనెల 22న నిర్వహిస్తామని యానాం పరిపాలనాధికారి మునిస్వామి తెలిపారు. దీనికి సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. యానాంలో మొత్తం 232మంది అభ్యర్థులు టైర్-1 అర్హత సాధించి టైర్-2కి ఎంపికయ్యారు. వీరికిగాను రెండు సెంటర్లు కేటాయించారు. పీఎంశ్రీ రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం పాఠశాల, డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్‌కళాశాలను కేటాయించడం జరిగిందన్నారు.

వైవీపాలెంలో మట్టిలారీలను అడ్డుకున్న గ్రామస్థులు

పి.గన్నవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైవీపాలెం దిగువున అక్రమ మట్టి తవ్వకాలు జరపడంతో కొంతమంది రైతులు గురువారం రాత్రి మట్టిలారీలను అడ్డుకున్నారు. ఈనేపథ్యంలో స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న ఆర్ఐ డాంగే, రెవెన్యూ సిబ్బంది ర్యాంపు వద్దకు చేరుకుని మూడు లారీలను మాత్రమే గుర్తించారు. రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్ కోసం వెళ్తున్న సమాచారం తెలుసుకున్న మాఫియా పెద్దలు చీకటిపడటంతో తవ్వకాలు జరిపే ప్రదేశంలో ఉన్న ఎక్స్‌కవేటర్‌ను మాయం చెయ్యడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీంతో రాత్రి వేళలో ఆర్ఐతోపాటు రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్ కోసం అన్వేషణ చేస్తున్నారు. ఏవిధమైన అనుమతులు లేకుండా అడ్డగోలుగా మట్టి ర్యాంపును ఏర్పాటుచేసి తవ్వకాలు ప్రారంభించారని రైతులు, స్థానికులు ఆరోపించారు. కాగా అక్రమ మట్టి ర్యాంపులో గుర్తించిన లారీలు, ఎక్స్‌కవేటర్‌పై ఏవిధమైన చర్యలు తీసుకుంటారో రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వలేదు. అక్రమ ర్యాంపు విషయం ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పుకొచ్చారు.

44వ రోజుకు చేరిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె

● 25 నుంచి ఆమరణ దీక్షలు

అమలాపురంటౌన్, జూన్19(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 44వ రోజుకు చేరుకుంది. దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో ఆందోళన ఉధృతం చేస్తున్నట్టు జిల్లా ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు యెరుబండి వెంకట సత్యనారాయణ తెలిపారు. దీక్షా శిబిరం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ కార్యాలయ ముట్టడికి నోటీసులు ఇస్తామన్నారు. 21 నుంచి 23వ తేదీ వరకు మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. 24న కుటుంబ సభ్యులతో కలిసి సమ్మె శిబిరంలో పాల్గొంటారు. చివరిగా 25వ తేదీ నుంచి ఆమరణ దీక్షకు దిగుతామని హెచ్చరించారు. సమ్మె శిబిరంలో పట్టణశాఖ అధ్యక్షుడు దంగేటి షణ్ముఖరావు, యూనియన్ నాయకులు సీహెచ్ శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, గంటి రమేష్, బోనం రమేష్, డి.కృష్ణ, ఎం.మధు, చిక్కాల తిరుమలవెంకటకుమార్, నాగారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై కూలిన చెట్టు

అయినవిల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): శానపల్లిలంక వద్ద ప్రధాన రహదారిపై భారీ వృక్షం కుప్పకూలింది. ముక్తేశ్వరం నుంచి ఎస్.మూలపొలం వెళ్లే ఈ రహదారిపై శానపల్లిలంక వద్ద భారీ వృక్షం గురువారం పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అదే సమయంలో రహదారిపై మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఓ కుటుంబం సురక్షితంగా బయటపడ్డారని, దీంతో ప్రమాదం తప్పిందని చెప్పారు.



శానపల్లిలంక వద్ద రహదారిపై కూలిన వృక్షం

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కాట్రేనికోన, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బలుసుతిప్ప పంచాయతీ ఎస్సీ కాలనీకి గత మూడు నెలలుగా తాగునీరు అందడం లేదంటూ మహిళలు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు ఈ అంశాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపినా ఫలితం లేకపోయింది. చెరువు ఎండిపోవడంతో వేసవిలో తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడ్డారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్ అన్నారు. కొందరు మోటార్లతో నీరు లాగేసుకుంటున్నారని ఆయన అన్నారు. గురువారం సీపీఎం మద్దతుతో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో ఇసుకపట్ల ప్రసాద్, కాశి సుహాసిని, కాశి భవాని, కాశి రమణమ్మ, ఇసుకపట్ల సీత, ఇసుకపట్ల మధు, కాకర నాగలక్ష్మి, కాకర భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ వెంటనే ఏర్పాటుచేయాలి

● అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గిడ్డి



డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యేను కోరుతున్న మహిళలు

పి.గన్నవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాకు ఇప్పటివరకు తాగునీటి పైపులైన్, ట్యాప్‌లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. డ్రైనేజీ వ్యవస్థ లేక మిగులునీరు రోడ్లపైకి వస్తోంది అంటూ పంచాయతీరోడ్డులో నివాసం ఉంటున్న స్థానిక మహిళలు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు మొరపెట్టుకున్నారు. స్థానికులు అభ్యర్థనతో గురువారం ఆయన నేరుగా నివాసగృహాలను సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక మహిళలు తమ సమస్యల ను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. గత కొన్నేళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్యను ఏ ప్రజాప్రతినిధి పరిష్కరించలేదని మీరైనా మాకు దారిచూపాలని కోరారు. మిగులు నీరు దిగే ప్రాంతాలను సైతం కొంత మంది పూడ్చేశారని ఎమ్మెల్యేకు చూపించారు. ఇలాగైతే వా డకం నీరు ఎలా దిగుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితులను గమనించిన ఎమ్మెల్యే మొదట తాగునీరు పైపులైన్ ఏర్పాటుచేసి ట్యాప్‌లను ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ చక్రవర్తిని ఆదేశించారు. డ్రైనేజీ ఏర్పాటు భారీ బడ్జెట్‌తో కూడిన పనిఅని తొందర్లోనే ప్రతిపాదనలు సిద్ధంచేసి డ్రైనేజీ ఏర్పాటుకు కృషిచేస్తానని మహిళలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ బొండాడ నాగమణి, కార్యదర్శి నిమ్మకాయల సత్యనారాయణ, నాయకులు సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాసరావు ఉన్నారు.

జనసేన నాయకుడు సుబ్బారావుకు ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న జనసేన పార్టీ నాయకుడు విళ్ల సుబ్బారావును పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం పరామర్శించారు. సుబ్బారావు మాతృమూర్తి విళ్ల రాజారత్నం బుధవారం మృతిచెందడంతో ఎమ్మెల్యే ఆమె చిత్రపటం వద్ద పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట జాలెం శ్రీనివాసరాజా, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, మద్దాల కృష్ణమూర్తి, వాసంశెట్టి కుమార్, కడలి నూకరాజు, మందా గాంధీ ఉన్నారు.

మట్టి తవ్వకాల కోసం శ్మశానవాటికను తవ్వేస్తారా!

● నాగుల్లంక గ్రామస్థుల నిరసన

పి.గన్నవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మట్టి తవ్వకాలుకోసం ర్యాంపు కోసం ఏటిగట్టు దిగువున ఉన్న శ్మశాన వాటికను తవ్వేస్తారా అంటూ నాగుల్లంక గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఈమేరకు గురువారం ర్యాంపు ఏర్పాటు ప్రదేశంలో నిరసనకు దిగారు. ర్యాంపు ఏర్పాటుచేసి తవ్వకాలు జరిపితే భారీ వాహనాల రాకపోకలతో ఏటిగట్టు బలహీన పడుతుందని తద్వారా వరదల సమయంలో గండ్లుపడే అవకాశం ఉందన్నారు. నాగుల్లంకలో కొంతమంది మాఫియా పెద్దలు రాజకీయ నాయకులు అండతో ర్యాంపు ఏర్పాటు చేసుకుని పశ్చిమగోదావరిజిల్లా గ్రామం రాయిలంక జిరాయితీ భూముల్లో మట్టి తవ్వకాలు జరిపేందుకు భారీ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈర్యాంపు వలన శ్మశానవాటికతోపాటు కూతవేటు దూరంలో ఉన్న కానకాయలంక కాజ్‌వేకు సైతం ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. ఈర్యాంపు అడ్డుకోకుంటే రాబోయే రోజుల్లో శ్మశానవాటిక అన్యాక్రాంతానికి గురవుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో యల్లమిల్లి చిట్టిబాబు, కారుపర్తి శ్రీను, గ్రంధి వెంకన్న, భీమాల వెంకటేశ్వరావు, కొటికలపూడి వెంకట్రావు, నూకల విశ్వేశ్వరావు, గ్రంధి చిట్టిబాబు, పాలూరి ఫణి, చిలకపాటి శ్రీను, యన్నాబత్తుల శేఖర్, చిట్టినీడి రంగాసాయి, ఆనందబాబు ఉన్నారు.

ఎంపీ హరీష్‌మాధుర్‌కు అభినందనలు



ఎంపీ హరీష్‌మాధుర్‌ను అభినందిస్తున్న జనసేన సీనియర్ నాయకులు

అమలాపురం టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌పై ప్రపంచ వేదికలపై గళం వినిపించి అమలాపురం నియోజకవర్గానికి చేరుకున్న ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను జనసేన నాయకులు అభినందనలతో ముంచెత్తారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎంపీ హరీష్‌ను కలిసి దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. నియోజకవర్గ సీనియర్ నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబులతోపాటు పలువురు నాయకులు ఎంపీతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో సమస్యలపై చర్చించారు. ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే తన దృష్టికి తీసుకురావాలని నల్లా శ్రీధర్‌కు ఎంపీ సూచించారు. నాయకులు ఆకుల బుజ్జి, ఆకుల సూర్యనారాయణమూర్తి, బండారు వెంకన్నబాబు, నల్లా వెంకటేశ్వరరావు, చిక్కం సూర్యమోహన్, కుంపట్ల రమేష్, వాకపల్లి సత్యం, చిట్టిబాబు, వీరు, నల్లా నాయుడు పాల్గొన్నారు.

'డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి'

అమలాపురంరూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల్లో డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. బండారులంకలో గత కొన్ని నెలలుగా చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించలేని పరిస్థితులను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బండారులంకతోపాటు పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఇదే సమస్య ఉన్నందున జిల్లా కేంద్రంలో 10 నుంచి 15 ఎకరాల భూమిని సేకరించి డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకు వచ్చేందుకు మంత్రి నారాయణతో సంప్రదింపులు జరిపినట్టు ఆయన తెలిపారు. బండారులంకకు చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త నల్లా ఈశ్వరి ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో శరీరం కాలిపోయి తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆమెకు సీఎం సహాయనిధి నుంచి రూ.50,800 చెక్కును గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె భర్త సత్యానందంకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, కాశిన చిన్నా, కాశిన బాబి, పెనుమాల ఏడుకొండలు, కొండా రాజు, బళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

అమలాపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లి హరిమనో వికాస కేంద్రంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో గురువారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. దివ్యాంగ పిల్లల సమక్షంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. దివ్యాంగులకు బియ్యం, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేకేసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంటెద్దు బాబి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మహబూబ్ షకీలా, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల ప్రసాద్, వస్కా బాబు, మాజీ ఎంపీపీ జోగి అర్జునరావు, పట్టణ కార్యదర్శి మొల్లేటి వెంకటేశ్వరరావు, పులుసుగంటి ప్రకాష్, అయితాబత్తుల కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

యానాం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యానాం నియోజవర్గంలోని మున్సిపల్ ఉద్యోగులు గత కొంత కాలంగా ప్రభుత్వం వేతనాలు అందించకపోవడంతో ఆందోళన చేశారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో టెంటువేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులతో పాటు విశ్రాంతి ఉద్యోగులు, నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

అమలాపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సాకుర్రు ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం విద్యామిత్ర కిట్లతో పాటు దాతలు అందించిన నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు అధ్యక్షతన పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా మాట్లాడుతూ తక్కువ మంది పిల్లలతో ఫౌండేషన్ స్కూలుగా నడిచిన పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మార్చి నలుగురు ఉపాధ్యాయులను నియమించడం అభినందనీయమన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లతో పాటు దాతలు అందించిన రూ.15వేలు విలువైన నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు ఆకుల సత్యనారాయణ, ఉప్పే సత్యనారాయణ, యాజమాన్య కమిటటీ చైర్మన్ శిరగం ఫణీంద్రరావు, హెచ్‌ఎం అప్పారి ముత్యాలరావు, ఉపాధ్యాయులు కాలెపు కిశోర్‌కుమార్, కొలిశెట్టి దుర్గారావు, ఆకుల బాలబసవేశ్వరరావు, ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు, చొల్లంగి సోమిశెట్టి, అజ్జరపు శేషు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ఉప్పలగుప్తం, జూన్ 19(ఆంధ్రజ్యోతి):విలసవిల్లిలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన సాదు శేషవేణి కుటుంబాన్ని గురువారం ఉప్పలగుప్తం, అమలాపురం జనసేన నాయకులు పరామర్శించారు. రూ.60వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కల్వకొలను తాతాజీ, నల్లా శ్రీధర్, యాళ్ళ నాగసతీష్, ఇసుకపట్ల రఘుబాబు, ఆకుల సూర్యనారాయణమూర్తి, ఆకుల బుజ్జి, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, చిక్కం సూర్యమోహన్, బండారు వెంకన్నబాబు, వాకపల్లి సత్యనారాయణ, పైబోడి పండు, కడియం సందీప్, పోలిశెట్టి ఉమ, నూకల రాజా, అత్తిలి రాము, నందుల నాగు పాల్గొన్నారు.

నగర పంచాయతీ టీడీపీ వార్డు కమిటీల ఎన్నిక

ముమ్మిడివరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొని వారితో మమేకం కావడంద్వారా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ముమ్మిడివరం నగర పంచాయతీ తెలుగుదేశం పార్టీ ఎన్నికల పరిశీలకుడు వేగిరాజు వెంకటసత్యనారాయణరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డులలో పది వార్డు కమిటీల ఎన్నిక గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన వార్డు కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. తాడి నరసింహారావు, సూరిబాబు, దొమ్మేటి రమణకుమార్, గొల్లపల్లి గోపీ, విళ్ల వీరాస్వామినాయుడు, కట్టా సత్తిబాబు, రెడ్డి శ్రీను, మాదాల నాగసత్యమంగా కుమారి, గోరింట శ్రీనురాజు, సరిపెల్ల శ్రీనివాసరాజు, చింతలపూడి బాబూరావు, నడింపల్లి శ్రీనివాసరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నవధాన్యాలతో యోగా డే చిహ్నం

కపిలేశ్వరపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాచర ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం యోగా డే చిహ్నాన్ని రూపొందించారు. నవధాన్యాలైన శనగలు, గోధుమలు, కందులు, పెసలు, చోళ్ళు, ధాన్యం ఉలవలు, అనువులు, బొబ్బర్లతో యోగా డే గుర్తును తయారు చేసి ఆకట్టుకున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు సాయి, శ్రీరామ్, వినయ్, వంశీ, వీరాంజనేయులను పాఠశాల హెచ్ఎం ఖండవిల్లి విజయ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు అభినందించారు.



విద్యార్థులు రూపొందించిన యోగా డే చిహ్నం


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఆత్రేయపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,22,266 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

వెండి కిరీటం బహుకరణ: వాడపల్లి ఆలయానికి గురువారం కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన రాయపురెడ్డి ప్రవల్లిక కుటుంబ సభ్యులు 150 గ్రాముల వెండి కిరీటాన్ని స్వామివారికి బహుకరించారు. కోస్టల్ బ్యాంకు రావులపాలెం శాఖ క్లస్టర్ హెడ్ ఉప్పులూరి హరిప్రియ, బ్రాంచ్ మేనేజర్ బాలకృష్ణ, సిబ్బంది లోవప్రసాద్ ఆలయానికి 500 లీటర్ల సామర్థ్యం గల వాటర్ కూలర్స్‌ను అందించారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటంతో పాటు, శేషవస్త్రం అందజేశారు.


వాడపల్లి వెంకన్నకు వెండి కిరీటాన్ని బహూకరిస్తున్న దాతలు



ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీ వద్ద అతిసార వ్యాధిపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో రావులపాలెంలో అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ

ఆలమూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి)): సీజన్‌లో వచ్చే అతిసారవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటే అదుపు చేయవచ్చునని వైద్యాధికారులు సూచించారు. ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో అతిసారవ్యాధిపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అతిసార వ్యాధి లక్షణాలు ఉంటే తక్షణం వైద్యులను సంప్రదించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ర్యాలీలో వైద్యులు డి.సాయికిషోర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కులు, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ మార్పుల దృష్ట్యా పిల్లలు అతిసార వ్యాధికి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి హసినా అన్నారు. రావులపాలెంలో ఆమె ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు అతిసార వ్యాధి సోకినట్లు అనుమానం వస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి

ప్రభుత్వ సుపరిపాలన చూసి ఓర్వలేక వైసీపీ అరాచకం

కొత్తపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శించారు. గురువారం కొత్తపేటలో టీడీపీ సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శల పేరుతో రౌడీలు, గుండాలను వెంటేసుకుని తిరుగుతున్నారన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే రీతిలో బెదిరిస్తున్నారన్నారు. ఇటువంటి అరాచకశక్తులను పోలీస్ యంత్రాంగం అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ మీరాన్‌షరీఫ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కముజు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా టవర్ల ఏర్పాటు


అమలాపురంటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం, ముమ్మిడివరం డబుల్ సర్క్యూట్ లైన్‌లో ఉన్న 30 విద్యుత్ టవర్లను విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో పూర్తి చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల మార్చి 27న కొత్తపేటలో ఒక విద్యుత్ డబుల్ సర్క్యూట్ లైన్ టవర్ కుప్పకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వం 30 సర్క్యూట్ డబుల్ లైన్ల టవర్లు మార్పు చేయాలని ఆదేశించిందన్నారు. వరిసాగులో ఉండడంతో కొంత జాప్యం జరిగిందన్నారు. ఎట్టకేలకు 30 టవర్లను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్ఈ గిరిబాబు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రాజబాబు, కార్యనిర్వాహక ఇంజనీర్లు కె.రత్నాలరావు, కె.రాంబాబు, శ్రీధర్, వై.విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి యోగాసనంలో ద్వితీయస్థానం సాధించిన రాకుర్తి జేఎస్‌డీ పవన్‌కుమార్. పక్క చిత్రంలో మంత్రులు దుర్గేష్, సత్యకుమార్ నుంచి మెమెంటో తీసుకుంటున్న దృశ్యం

యోగాసనాల్లో పవన్ కుమార్‌కు అవార్డు

కొత్తపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మోడేకుర్రు శివారు రాకుర్తిపాలేనికి చెందిన రాకుర్తి జేఎస్‌డీ పవన్‌కుమార్‌కు రాష్ట్రస్థాయి యోగాసనాల్లో ద్వితీయస్థానం దక్కింది. యోగాంధ్ర పోటీల్లో భాగంగా విజయవాడలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో ఆయనకు ద్వితీయస్థానం లభించింది. గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్, సత్యకుమార్ నుంచి ఆయన అవార్డును అందుకున్నారు. ఈ నెల 21న విశాఖ యోగాసనాల కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాను ఏలూరు సీఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ విజ్ఞాన్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. తొమ్మిదేళ్లుగా యోగాభ్యాసం చేస్తూ జాతీయస్థాయిలో బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించానన్నారు. విదేశీయులకు ఆన్‌లైన్‌లో యోగా నేర్పిస్తుంటానని తెలిపారు.



విద్యార్థులకు సైకిళ్లు అందచేస్తున్న సర్పంచ్ మంగాదేవి, ఎంపీటీసీ సతీష్ తదితరులు

ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు

ద్రాక్షారామ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కాపవరం ఉన్నత పాఠశాలకు ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. గ్రామ ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్ గతంలో కాపవరంలో ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవంలో ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. కందులపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి వెంకట ప్రవీణ్, వినకోటి రాజేష్, వేలుపుకొండ మణికంఠ, సాయి ప్రభాష్ తదితరులకు తొలి విడతగా సర్పంచ్ యనమదల మంగాదేవి చేతుల మీదుగా సైకిళ్లు అందచేశారు. ఇతర గ్రామాల నుంచి ఎంతమంది కాపవరం పాఠశాలకు విద్యాభ్యాసానికి వచ్చినా వారందరికీ సైకిళ్లు అందచేస్తానని సతీష్ తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గీసాల వీర వెంకట రామ్ ప్రసాద్, హెచ్ఎం ముమ్మిడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు వాసంశెట్టి వెంకటరమణ, సంక్షేమ సహాయకురాలు పాలిక శ్రీరామలక్ష్మి, పాఠశాల మాజీ వైస్ చైర్మన్ అడపా రాంబాబు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

మాధవరావుకు పలువురు పరామర్శ

రాయవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పితృ వియోగంతో బాధపడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవరావును గురువారం పలువురు పరామర్శించారు. మండలంలోని వెంటూరు గ్రామంలో ఆయన్ను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, మండపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిర్ల రామచంద్రారెడ్డి పరామర్శించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



ఆత్రేయపురం మండలం వాడపల్లి వద్ద మూసుకుపోయిన పంటకాలువ. పక్క చిత్రంలో మెర్లపాలెం వద్ద పిచ్చిమొక్కలతో మూసుకుపోతున్న బ్యాంక్ కెనాల్

ఇలా మూసుకుపోతే..సాగునీరు వచ్చేదెలా..?

• అవరోధంగా మారిన పిచ్చిమొక్కలు • చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం • రైతుల అసంతృప్తి

ఆత్రేయపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సాగునీరు ముందుకు వెళ్లే మార్గం లేక రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలో క్లోజర్ పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో సాగునీరు ముందుకు వెళ్లే మార్గం కనిపించడం లేదు. ఈనెల 1న సెంట్రల్ డెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు నీరు విడుదల చేశారు. ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్ సైఫాన్ నిర్మాణ పనులు చేపట్టడంతో వారం క్రితమే సాగునీరు విడుదల చేశారు. సెంట్రల్ డెల్టాకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయడంతో రైతులు ఏరువాక నిర్వహించి వరినారుమడులు వేసేందుకు సన్నద్ధమయ్యారు. మరోవైపు నేటికీ పంట కాలువల ఆధునీకరణకు నోచుకోలేదు. ఆత్రేయపురం రేవు నుంచి సెంట్రల్ డెల్టా ప్రధాన కాలువ వాడపల్లి వెళ్లే సైడ్ ఛానల్ పచ్చగడ్డి, తూడుకాడలు పెరిగిపోయి సాగునీరు పారడం లేదు. సైడ్ ఛానల్ కాలువ ద్వారా వేల ఎకరాలు సాగుచేసి పంటలు పండిస్తున్నారు. కొన్నిచోట్ల రైతులే స్వచ్ఛందంగా చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. సెంట్రల్ డెల్టా కాలువల్లోని చెత్తా చెదారాలు పడేయడంతో డంపింగ్ యార్డును తలపిస్తున్నది. దీంతో లొల్ల లాకుల వద్దకు వ్యర్థాలు చేరుకుంటున్నాయి. బ్యాంకు కెనాల్ కాలువలో పిచ్చిమొక్కలతో సాగునీరు ముందుకు కదలడంలేదు. ప్రధాన కాలువలే ఇలా ఉంటే శివారు ప్రాంతాలకు సాగునీరు ముందుకు సాగేదెలా, పంటలు పండేది ఎలా అంటూ రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి సంఘాలు రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని సాగునీరు ప్రవాహం శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

22న ఉచిత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద 22న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన వివరాలను తెలిపారు. దివంగత చిలుకూరి మాచరయ్య, సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కేపిటల్ హాస్పిటల్(కాకినాడ) వైద్యులతో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరాన్ని అంగర పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పీచు బొమ్మల తయారీపై శిక్షణ

మామిడికుదురు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కొబ్బరి పీచుతో తయారుచేసే బొమ్మల తయారీపై మహిళలకు శిక్షణ కార్యక్రమం ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నది. పాశర్లపూడి బాడవలో డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు పేరిట కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.


ఎచ్చెర్లలో ఎమ్మెల్యే వేగుళ్లకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

ఎచ్చెర్లలో యోగాంధ్ర ఇన్‌చార్జిగా వేగుళ్ల

మండపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో గురువారం జరిగిన యోగాంధ్ర సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్ల హాజరయ్యారు. ఎచ్చెర్ల చేరుకున్న ఆయనకు టీడీపీ స్థానిక నేతలు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన యోగాంధ్ర సన్నాహక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన వారిలో అర్తమూరుకు చెందిన సాయిబాబారెడ్డి, ఆర్.వేంకటేశ్వరరావు తదితరులు వున్నారు.

పల్లాను పరామర్శించిన ఎమ్మెల్యే: పితృ వియోగంతో బాధపడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను, మండపేట ఎమ్మెల్యే చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం విశాఖలో పరామర్శించారు.

యోగాతో మానసిక వికాసం


రాయవరం భాష్యం స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

రాయవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యోగాతోనే మానసిక వికాసం సాధ్యమవుతుందని రాయవరం భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్త అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. పాఠశాల పీఈటీ విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత వివరించి యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంపై శిక్షణ: రాయవరం సత్యసాయి మందిరంలో ఉన్న వెలగల వెంకటరెడ్డి ధ్యాన మందిరంలో గురువారం యోగాపై శిక్షణ నిర్వహించారు. యోగా గురువు వెలగల పణికృష్ణారెడ్డి మాట్లాడుతూ యోగా వల్ల ఒత్తిడి, ఆందోళన వంటి రుగ్మతల నుంచి బయటపడటంతో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి దీన్ని సాధన చేయాలన్నారు. అనంతరం రాయవరం పరిసర ప్రాంతాల వారికి ధ్యానంపై శిక్షణ ఇచ్చారు.

కొనసాగిన శిక్షణ తరగతులు

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): మనసును, శరీరాన్ని ఒకేచోట ఉంచగలిగితే అనుకున్న లక్ష్యానికి చేరుకోగలరని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పగడాల ఆనందతీర్థాచార్యులు అన్నారు. యోగాను క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చున్నారు. ఆలమూరు మండలం జొన్నాడలో దాససాహిత్య ప్రాజెక్టు ద్వారా నిర్వహిస్తున్న పురందరదాసు సంకీర్తన భక్త మండలి సభ్యులకు జరిగే శిక్షణ తరగతుల్లో గురువారం ఆయన పాల్గొని ప్రసంగించారు. యోగా డేను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన సూచించారు.

సంకీర్తనలు వ్యాప్తి జరగాలి: వేంకటేశ్వరస్వామిని కీర్తిస్తూ పురందరదాసు రచించిన సంకీర్తనలు ఎంతో ప్రాచుర్యం పొందాయని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు కృషి చేస్తున్నదని ప్రత్యేకాధికారి పి.ఆనందతీర్థాచార్యులు తెలిపారు. పురందరదాసు సంకీర్తలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వాటిపై పూర్తి అవగాహన పెరుగుతుందన్నారు. అనేక ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పురందరదాసు సంకీర్తన మండలి ఏర్పాటు ప్రత్యేక ప్రతినిధి పి.ముకుందేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోడరన్ విద్యార్థుల యోగాంధ్ర

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో గురువారం మోడరన్ విద్యా సంస్థల విద్యార్థులతో యోగాంధ్ర నిర్వహించారు. విశాఖలో జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం స్ఫూర్తిగా సుమారు వెయ్యి మంది విద్యార్థులతో యోగాభ్యాసన నిర్వహించారు. యోగా గురువు తొగరు మూర్తి వారితో యోగాభ్యాసన నేర్పించారు. మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు మాట్లాడుతూ యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మోడరన్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


రామచంద్రపురంలో యోగాభ్యాసనలో పాల్గొన్న మోడరన్ విద్యార్థులు

ప్రభుత్వ ఆర్థికసాయంపై బాధిత కుటుంబం హర్షం

మండపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణానికి చెందిన వెండి నగలు తయారు చేసే కార్మికుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం చేసింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రభుత్వం నుంచి రూ.7లక్షల ఆర్థికసాయాన్ని మంజూరు చేయించటంపై సహచర కార్మికులు, పలువురు నేతలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీప్రకాష్‌లకు కామాక్షి సిల్వర్ వర్కర్స్ కృతజ్ఞతలు తెలిపారు. మృతుడు సత్తిపండు కుటుంబాన్ని ఆదుకున్న వారికి సహచర కార్మికులు ధన్యవాదాలు తెలిపారు.

రాహుల్ జన్మదిన వేడుకలు

మండపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండపేటలో రాహుల్‌గాంధీ 55వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు సారథ్యంలో గురువారం జరిపారు. రాహుల్ పుట్టిన రోజు సందర్భంగా మండపేటలో వున్న మయూరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలను ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాడిశెట్టి సత్యనారాయణ, మగ్గం జాకబ్, అలమండ సూరిబాబు, కుచ్చు బాబి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పానీయాలకు దూరంగా ఉండండి

ఆలమూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నేటి యువత చెడు స్నేహాలతో పెడదారి పడుతున్నారని ముఖ్యంగా మత్తు పానీయలకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. ఆలమూరు గణేష్ కాలనీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల ఆలమూరులో జరిగిన ఘటనలో అనేక మంది యువకులు జైలు పాలయ్యారని దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ చెడు స్నేహాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డును మరమ్మతు చేయరూ..

రావులపాలెం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కొమరాజులంక శివారు మల్లాయిదొడ్డి వెళ్లే రహదారిని ఆధునికీకరించాలని కార్యదర్శికి ఆ ప్రాంతవాసులు వినతిపత్రాన్ని అందచేశారు. కర్రి అర్జునరెడ్డి ఇంటి వద్ద నుంచి మట్టపర్తి శ్రీనివాస్ ఇంటి వరకు ఉన్న రహదారి ఛిద్రం అవడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. వెంటనే ఈ రహదారిని ఆధునికీకరించాలని వారు ఇచ్చిన వినతిపత్రంలో తెలిపారు.

150 మందికి దంత, నేత్ర పరీక్షలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం వైఎస్ఆర్ నగర్‌లో గురువారం పీడీఎస్‌యు, భీమ్ సైనిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరంలో 150 మందికి వైద్యసేవలు అందించారు. కపిలేశ్వరపురం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ యు.పూర్ణ, సుబ్రహ్మణ్యంలు వంద మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ద్రాక్షారామకు చెందిన హ్యాపీ డెంటల్ క్లినిక్ వైద్యులు పిల్లి వినయ్‌కుమార్, కె.సుధాకిరణ్ దంత పరీక్షలు జరిపి వైద్యసేవలందించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, సందర్శించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, భీమ్ సైనిక్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగరాజు, అంబటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యర్రపోతవరంలో...

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రపోతవరం గ్రామంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం జరిగింది. పెనుగుదురుకు చెందిన అంజన మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి ఏర్పాటు చేసింది. శిబిరంలో 75 మందికి వివిధ రకాల దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దంత వైద్యులు సలాది వీర వెంకటేష్, మాన్విత, లావణ్య, చందులు వైద్య సేవలు అందించారు. యర్రపోతవరం, శివల, బాలాంత్రం, వేగాయమ్మపేటలకు చెందిన ప్రజలు హాజరయ్యారు.


కె.గంగవరం మండలం యర్రపోతవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


చొప్పెల్లలో సుపరిపాలన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ పాలన పట్ల ప్రజల హర్షం

ఆలమూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలన పట్ల దేశ ప్రజలు ఆనందంగా ఉన్నారని భారతీయ జనతాపార్టీ నాయకులు అన్నారు. చొప్పెల్లలో గురువారం ప్రధాని మోదీ సుపరిపాలన వాల్‌పోస్టర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, వికసిత్ భారత్ జిల్లా ఇన్‌చార్జ్ యాళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు సుంకర శ్రీరాములు, నాయకులు చిలకమర్తి కస్తూరి, తమలంపూడి రామకృష్ణారెడ్డి, పాలూరి సత్యానందం, అయినవిల్లి సత్తిబాబుగౌడ్, వడ్డి దొరయ్యనాయుడు, నాగిరెడ్డిస్వామి తదితరులు ఆవిష్కరించారు. బీజేపీ 11 ఏళ్ల పాలనలో ప్రపంచంలోనే ఆర్థికంగా నాలుగో స్థానానికి చేరుకుందన్నారు. బ్యాంకింగ్ రంగానికి దేశంలో ఏడు కోట్ల మంది మాత్రమే ఉండేవారని ప్రస్తుతం 52 కోట్ల మందికి చేరుకున్నారని వారు తెలిపారు. బీజేపీ పాలనపై దేశ ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాను పరామర్శించిన శ్రీను

కె.గంగవరం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రేవు శ్రీను గురువారం పరామర్శించారు. ఇటీవల శ్రీనివాసరావు తండ్రి సింహాచలం మృతి చెందారు. విశాఖలో గురువారం శ్రీనివాసరావు ఇంటి వద్ద శ్రీను కలసి సానుభూతి తెలిపారు. సింహాచలం చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయన వెంట కూటమి నాయకులు పేకేరు బాబ్జి, పెమ్మాడి సత్తిబాబు తదితరులు ఉన్నారు.


పల్లా సింహాచలానికి నివాళులర్పిస్తున్న దృశ్యం